

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 23-04-2026 | సంపుటి - 27 | సంచిక -330 | రూ : 4 | పేజీలు: 8




## జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక సిఫార్సులు అమలుకు అనర్హం

- వాటి ఆధారంగా చర్యలొద్దు
- కేసీఆర్, హరీశ్ సహా పిటిషనర్లకు ఊరట
- 'కాళేశ్వరం' అవకతవకలపై కమిషన్ ఏర్పాటు ఏకపక్షమేమీకాదు
- వాస్తవాలను తేల్చడానికి చట్టబద్ధంగా నెలకొల్పినదే
- హైకోర్టు తీర్పు

2లో

## దావోస్, రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లోని ఎంవోయూలపై రేవంత్ రెడ్డి సమీక్ష

- కంపెనీలకు సౌకర్యాలు, భవిష్యత్తు అవసరాలపై ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని సూచన
- ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించాలని సూచన
- ప్రముఖ సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలన్న ముఖ్యమంత్రి



2లో




## పహల్గామ్ ఉగ్రదాడి దేశం మొత్తాన్ని కలిచివేసింది

2లో

- పహల్గామ్ ఉగ్రదాడికి ఏడాది
- ఎక్స్ వేదికగా నివాళులర్పించిన ప్రధాని మోదీ
- ప్రాణాలు కోల్పోయిన అమాయకులను ఎప్పటికీ మరిచిపోలేమన్న మోదీ

## ఎండల వేళ పిల్లల కోసం 'వాటర్ బెల్'

2లో

- వేసవి నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యం కోసం ఢిల్లీ ప్రభుత్వం మార్గదర్శకాలు
- విద్యార్థులు నీరు త్రాగాలని గుర్తు చేయడానికి ప్రతి గంటకు ఒకసారి బెల్ మోగించాలని సూచన
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు





## గుజరాత్ పోర్టుకు వస్తున్న నౌకను సీజ్ చేసిన ఇరాన్

- రెండు కంటైనర్లను సీజ్ చేసిన ఐఆర్జీసీ
- పనామా జెండా, లైబీరియా జెండా కలిగిన నౌకల సీజ్
- నౌకలు తమ ఆధీనంలో ఉన్నట్లు ప్రకటించిన ఇరాన్ మీడియా

2లో

# ఎక్కడి బస్సులు అక్కడే

- రాష్ట్రవ్యాప్తంగా తొలి రోజు ఆర్టీసీ సమ్మె ప్రశాంతం
- ఉదయం నుంచే విధులకు దూరంగా కార్మికులు
- పలుచోట్ల అద్దె బస్సులను నడిపిన యాజమాన్యం
- ప్రయాణికులకు ఇబ్బందులు.. ప్రైవేటు వాహనాల్లో అధిక ఛార్జీలు
- నేడు అన్ని డిపోల్లో మహాధర్నాలు: ఐకాస ఛైర్మన్ వెంకన్న

2లో





## ఆర్టీసీ సమ్మె... హైదరాబాద్ మెట్రో కీలక నిర్ణయం

- ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రయాణాలకు ఇబ్బంది
- హైదరాబాద్‌లో మెట్రో సర్వీసులు పెంచుతున్నట్లు వెల్లడి
- రాత్రి 11 గంటల తర్వాత కూడా సర్వీసులను పొడిగించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడి

2లో

## రాష్ట్రంలో ఇక స్మార్ట్ మార్కెట్‌యార్డులు

ఐటీ, ఏఐ సాంకేతికతల వినియోగం
క్రయవిక్రయాలు, లావాదేవీలు ఆన్‌లైన్‌లో నమోదు
మార్కెటింగ్‌శాఖ ఏర్పాట్లు

2లో

# ఇరాన్‌తో చర్చలపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు.. శుక్రవారం శుభవార్త?

- ఇరాన్‌తో శాంతి చర్చలపై ట్రంప్ ఆశాభావం
- శుక్రవారం శుభవార్త ఉండొచ్చన్న అమెరికా అధ్యక్షుడు
- ట్రంప్ వ్యాఖ్యలను కొట్టిపారేసిన ఇరాన్
- చర్చలపై ఎలాంటి నిర్ణయం

**తీసుకోలేదని స్పష్టీకరణ**

వాషింగ్టన్/టెహ్రాన్, ఏప్రిల్ 22 : ఇరాన్‌తో రెండో విడత శాంతి చర్చలపై శుక్రవారం నాటికి 'శుభవార్త' వెలువడొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే 36 నుంచి 72 గంటల్లో చర్చలు పునఃప్రారంభం కావచ్చని ఇవాళ 'న్యూయార్క్ పోస్ట్' సైతం ఓ కథనాన్ని ప్రచురించింది. దీనిపై ట్రంప్ స్పందిస్తూ "అది సాధ్యమే" అని బదులివ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్‌కు అనుబంధంగా పనిచేసే 'తస్నీమ్ న్యూస్' ఏజెన్సీ ఈ మేరకు 'ఎక్స్'లో ఓ పోస్ట్ చేసింది. "ట్రంప్ మళ్లీ అబద్ధం చెప్పారు. శుక్రవారం చర్చలు జరిపే అంశంపై ఇరాన్‌కు ప్రస్తుతానికి ఎలాంటి నిర్ణయం లేదు" అని స్పష్టం చేసింది. శాంతి చర్చలకు మరింత సమయం ఇచ్చేందుకు అమెరికా ప్రకటించిన కాల్పుల విరమణను ట్రంప్ పొడిగించారు. ఈ వ్యూహ మార్పునకు పాకిస్థాన్ నాయకత్వంతో జరిపిన సంప్రదింపులే కారణమని ట్రంప్ పేర్కొన్నారు. "ఇరాన్ ప్రభుత్వం అంతర్గతంగా తీవ్రంగా చీలిపోయింది. పాకిస్థాన్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్ అభ్యర్థన మేరకు.. ఇరాన్ నేతలు ఒక ఏకీకృత ప్రతిపాదనతో వచ్చేవరకు ఆ దేశంపై దాడిని నిలిపివేయాలని నిర్ణయించాం" అని ట్రంప్ సోషల్ మీడియాలో రాసుకొచ్చారు. "మా సైన్యాన్ని అప్రమత్తంగా ఉండాలని, దిగ్బంధనాన్ని కొనసాగించాలని ఆదేశించాను. ఇరాన్ ప్రతిపాదన వచ్చేవరకు కాల్పుల విరమణను పొడిగిస్తున్నాను" అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

## కాళేశ్వరం తీర్పుపై కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, ఏప్రిల్ 22 : కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్‌పై దుష్ప్రచారం చేసిన వారి చెంప చెళ్లుమనిపించేలా హైకోర్టు తీర్పు వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, ఈ తీర్పు ద్వారా కూలింది కాళేశ్వరం కాదని, కాంగ్రెస్ చేసిన కుట్రలు అని వ్యాఖ్యానించారు. హైకోర్టు తీర్పుతో ఈరోజు గెలిచింది తెలంగాణ ప్రజలు, రైతులు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కృషి చేసిన ఇంజినీర్లు అన్నారు. మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై దుష్ప్రచారం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈరోజు తెలంగాణలో పారుతున్న ప్రతి నీటిబొట్టు కేసీఆర్ చేసిన కృషివల్లే వచ్చిందని అన్నారు. తెలంగాణ భూమిపై గోదావరి పారినన్ని రోజులు కేసీఆర్ చరిత్రను ఎవరూ చెరపలేరని అన్నారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై ఈరోజు హైకోర్టు ఇచ్చిన తీర్పుతో అందరికీ అసలు విషయం తెలిసిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు కచ్చితంగా వరప్రదాయిని అన్నారు. రూ.94 వేల కోట్లు ఖర్చయితే రూ.1 లక్ష కోట్లు అని ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం అంటే ఒక్క బ్యారేజీ కాదని, మూడు బ్యారేజీలు అని తెలిపారు. కాంగ్రెస్ చేసిన కుట్రల వల్ల మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని ఆరోపించారు. రాష్ట్రంలో చెక్ డ్యాంలు బాంబులు పెట్టి పేలుస్తుంటే కేంద్రం ఏం చేస్తోందని ప్రశ్నించారు.

## గుజరాత్ పోర్టుకు వస్తున్న నౌకను సీజ్ చేసిన ఇరాన్

దుబాయ్/టెహ్రాన్, ఏప్రిల్ 22: హర్మూజ్ జలసంధి వద్ద కీలక పరిణామం చోటు చేసుకుంది. గుజరాత్ పోర్టుకు వస్తున్న నౌక సహా రెండు కంటైనర్లను ఇరాన్ సీజ్ చేసింది. కాల్పుల విరమణ గడువును పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటిస్తూనే, పోర్టుల దిగ్బంధనం మాత్రం కొనసాగుతుందని తెలిపారు. దీనితో ఇరాన్ ధీటుగా స్పందిస్తోంది. ఈ క్రమంలో రెండు నౌకలపై ఇరాన్ ఉదయం కాల్పులు జరిపింది. అలాగే రెండు నౌకలు తమ స్వాధీనంలో ఉన్నట్లు ఐఆర్జీసీ తెలిపింది. ఇందులో ఒక నౌక గుజరాత్ తీరానికి వస్తున్న క్రమంలో చోటు చేసుకుంది. పనామా జెండా కలిగిన ఎంఎస్సీ ఫ్రాన్సిస్కా, లైబీరియా జెండా కలిగిన ఎపామినోండాస్ కార్గో నౌకలు తమ ఆధీనంలో ఉన్నట్లు ఇరాన్ మీడియా ప్రకటించింది. గ్రీస్‌కు చెందిన యూఫోరియా అనే మరో నౌకను కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు ప్రకటించింది.

## దావోస్, రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లోని ఎంవోయూలపై రేవంత్ రెడ్డి సమీక్ష

హైదరాబాద్: దావోస్, రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీలకు భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ రెండు సదస్సుల్లో జరిగిన ఎంవోయూలపై ఆయన బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రౌండ్ అయిన కంపెనీలు, పెండింగ్ అంశాలు, ఫ్యూచర్ సిటీ, ఇతర ప్రాంతాల్లో సంస్థలకు కేటాయించాల్సిన భూమి వివరాలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పెట్టుబడులు పెట్టే కంపెనీలకు సౌకర్యాలు, భవిష్యత్తు అవసరాలపై ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసిన నీటిని డేటా సెంటర్లు వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలను మూడు కేటగిరీలుగా విభజించి, ప్రముఖ సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి అన్నారు. ఆయా సంస్థలు రాష్ట్రంలో త్వరగా కార్యకలాపాలు ప్రారంభించేలా చూడాలని అన్నారు.

## జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక సిఫార్సులు అమలుకు అనర్హం

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణల్లో అవకతవకలపై ఏర్పాటైన జస్టిస్ ఘోష్ కమిషన్ చేసిన నిర్ధారణలు, పరిశీలనలు అమలుకు అనర్హమని హైకోర్టు పేర్కొంది. వాటి ఆధారంగా పిటిషనర్లయిన మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారి స్మితాసభర్వాల్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్.కె.జోషిలపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని స్పష్టం చేసింది. అయితే జస్టిస్ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ 2024 మార్చి 14న జారీ చేసిన జీవో 6 ఏకపక్షం, చట్టవిరుద్ధం కాదని, అంతేగాకుండా రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించలేదని పేర్కొంది. జీవో 6ను సవాలు చేస్తూ కేసీఆర్, హరీశ్‌రావు, స్మితా సభర్వాల్, ఎస్.కె.జోషిలు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్‌లను హైకోర్టు పాక్షికంగా అనుమతిస్తూ బుధవారం తీర్పు వెలువరించింది. జీవోను రద్దు చేయాలని, కమిషన్ నివేదిక చెల్లదని ప్రకటించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం అన్ని పక్షాల వాదనలను, ఇరుపక్షాలు సమర్పించిన పలు సుప్రీంకోర్టు తీర్పులను పరిశీలించింది. "జస్టిస్ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో ఏకపక్షం, చట్టవిరుద్ధం కాదు. రాజ్యాంగానికి, 1952 కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ చట్టంలోని సెక్షన్ 3కు విరుద్ధమేమీ కాదు. అయితే కమిషన్ చేసిన నిర్ధారణలు, పరిశీలనలు పిటిషనర్ల పేరు ప్రతిష్ఠలకు హానికరంగా ఉన్నాయి. వారిపై నిందారోపణలు చేసే ముందు వాటికి సంబంధించిన ఆధారాలను అందించాలి. సాక్షులను ప్రశ్నించే అవకాశం ఇవ్వాలి. అలా చేయకపోవడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా, కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ చట్టంలోని సెక్షన్ 8 కింద ఉన్న చట్టబద్ధ రక్షణలను ఉల్లంఘించేలా ఉన్నాయి. అందువల్ల ఈ నిర్ధారణలు, పరిశీలనలు ఆచరణాత్మకం కావు. వాటి ఆధారంగా పిటిషనర్లపై ఎలాంటి చర్యలు తీసుకోరాదు" అని ధర్మాసనం 102 పేజీల తీర్పు వెలువరించింది.

## ఎక్కడి బస్సులు అక్కడే

హైదరాబాద్: సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధనకు ఆర్టీసీ ఐకాస చేపట్టిన సమ్మె తొలిరోజు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రశాంతంగా జరిగింది. ఉదయం తొలి షిఫ్టు నుంచే ఉద్యోగులు విధులకు దూరంగా ఉండటంతో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ఆర్టీసీ యాజమాన్యం హైదరాబాద్ సహా జిల్లాల్లో అద్దె బస్సులను రోడ్డెక్కించగా పలుచోట్ల కార్మికులు అడ్డుకున్నారు. ఎంజీబీఎస్, జేబీఎస్ లాంటి ప్రధాన బస్టాండ్లకు స్వల్ప సంఖ్యలోనే బస్సులు వచ్చాయి. అనుకున్న విధంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేకపోవడంతో ప్రయాణికులు ఆటోలు, క్యాబ్‌లను ఆశ్రయించాల్సి వచ్చింది. ఇదే అదనుగా వారు ఛార్జీలు పెంచడంతో పలువురు ఇబ్బంది పడ్డారు. హైదరాబాద్‌లో కొందరు ప్రయాణికులు ఎంఎంటీఎస్, మెట్రో రైళ్లను ఆశ్రయించారు. మరోవైపు ఆర్టీసీలో సూపర్‌వైజర్ల సంఘం ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఐఏఎస్‌ల కమిటీని స్వాగతించింది. సమ్మెలో పాల్గొనడం లేదని సంఘం ప్రధానకార్యదర్శి వాసుదేవరావు ప్రకటించారు. జేఏసీ నేతలు మాత్రం ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నేతలను కలిసి మద్దతు కోరారు.

**అక్కడక్కడా ఉద్రిక్తతలు**

ఆర్టీసీలోని దాదాపు 3,500 ఎలక్ట్రిక్ బస్సులను నడిపేందుకు యాజమాన్యం ప్రయత్నించింది. ప్రైవేటు విద్యాసంస్థల, పరిశ్రమల బస్సులనూ సిద్ధం చేసింది. డీజిల్, ఎలక్ట్రిక్ అద్దె బస్సులు భారీ సంఖ్యలో ఉన్న హైదరాబాద్, ఉమ్మడి నల్గొండ తదితర జిల్లాల్లో వీటిని నడిపేందుకు అధికారులు ప్రయత్నించగా కార్మికులు పలుచోట్ల అడ్డుకున్నారు. బోధన్ డిపో ముందు నిరసనకు దిగారు. కామారెడ్డి బస్టాండ్ దగ్గర ఉద్రిక్తత నెలకొంది. ప్రైవేట్ డ్రైవర్ బస్సును తీసేందుకు యత్నించగా ఐకాస నేతలు టైర్లలో గాలితీశారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా కార్మికులు నిరసనలో పాల్గొన్నారు. సంగారెడ్డి కొత్త బస్టాండ్ వద్ద ఆర్టీసీ ఉద్యోగులు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎక్కడి బస్సులు అక్కడ నిలిచిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల అద్దె బస్సులు నడిచాయి.

**డిమాండ్లు పరిష్కరించేంత వరకు..**

ఆర్టీసీ ఐకాస 23న మహాధర్నాకు పిలుపునిచ్చింది. గురువారం ఉదయం 5 గంటలకు కార్మికులు అన్ని బస్ డిపోలు, వర్క్‌షాప్‌లకు చేరుకోవాలని ఐకాస ఛైర్మన్ ఈదురు వెంకన్న కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందని ఐకాస స్పష్టం చేసింది. 'కమిటీతో 32 డిమాండ్లపై సుదీర్ఘంగా చర్చించాం. ప్రధాన సమస్యల పరిష్కారంపై స్పందన రాలేదు. 30 శాతం ఫిట్‌మెంట్ తగ్గకుండా 2021 వేతన సవరణ చేయాలి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎలక్ట్రిక్ బస్సుల్ని రద్దుచేయాలి. ఇతర జోన్లకు చేసిన ఉద్యోగుల బదిలీ ఉత్తర్వుల్ని వెనక్కి తీసుకోవాలి'అని వెంకన్న డిమాండ్ చేశారు.

## ఎండల వేళ పిల్లల కోసం 'వాటర్ బెల్'

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22 : దేశ రాజధాని ఢిల్లీలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో, విద్యార్థుల భద్రత అధికారులకు ప్రధాన ఆందోళనగా మారింది. ఎండ వేడి సంబంధిత ప్రమాదాలను తగ్గించడానికి, వేసవి తీవ్రత ఎక్కువగా ఉండే రోజులలో పిల్లల భద్రత కోసం ఢిల్లీ పాఠశాలలు ఇప్పుడు తక్షణ చర్యలు చేపడుతున్నాయి. విద్యార్థుల ఆరోగ్యం కోసం ఢిల్లీ ప్రభుత్వం పాఠశాలలకు మార్గదర్శకాలను జారీ చేసింది. పిల్లల్లో డీహైడ్రేషన్, వేడి సంబంధిత అనారోగ్యాలను నివారించడానికి ముందుజాగ్రత్త చర్యలను అమలు చేయాలని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ గుర్తింపు పొందిన పాఠశాలలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల ప్రకారం, ఈ వేసవి కాలంలో విద్యార్థులకు నీరు త్రాగాలని గుర్తు చేయడానికి ప్రతి 45 నిమిషాల నుంచి 60 నిమిషాలకు గంట మోగించాలి. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న క్రమంలో, విద్యార్థులు క్రమం తప్పకుండా నీటిని తీసుకునేలా ఢిల్లీ ప్రభుత్వం వినూత్న ఆలోచన చేసింది. అలాగే, విద్యార్థులను గ్రూపులుగా చేసి, ఒకరి యోగక్షేమాలను మరొకరు తెలుసుకునేలా బడ్డీ సిస్టంను ప్రవేశపెట్టింది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున, మార్నింగ్ అసెంబ్లీని రద్దు చేసింది లేదా వాటిని తక్కువ సమయంలో పాఠశాల లోపల నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. బహిరంగ తరగతులను నిషేధించింది. పాఠశాలల్లో వెలుపల నిర్వహించే ఫిజికల్ యాక్టివిటీస్‌ను కూడా నిలిపివేయాలని ఆదేశించింది. పాఠశాలల్లో నిత్యం చల్లని తాగునీరు అందుబాటులో ఉంచాలని పేర్కొంది. ఢిల్లీ ప్రభుత్వం తల్లిదండ్రులు, విద్యార్థులకు కూడా సూచనలు చేసింది. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించింది. ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో ఈ విషయాన్ని పంచుకోవాలని తెలిపింది. వడగాల్పు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సూచించింది. తమ పిల్లలను తేలికైన గాలి సులభంగా ఆడే కాటన్ దుస్తుల్లో పాఠశాలకు పంపించాలని ప్రభుత్వం తల్లిదండ్రులకు సూచించింది.

## పహల్గామ్ ఉగ్రదాడి దేశం మొత్తాన్ని కలిచివేసింది: ప్రధాని

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22 : పహల్గామ్ ఉగ్రదాడి దేశం మొత్తాన్ని కలిచివేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ విషాదాన్ని, అలాగే ప్రాణాలు కోల్పోయిన వారిని ఎప్పటికీ మరిచిపోలేమని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి జరిగి నేటికి ఏడాది అయింది. ఈ నేపథ్యంలో దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఆయన నివాళులర్పించారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. గత సంవత్సరం ఇదే రోజున పహల్గామ్‌లో దారుణమైన ఉగ్రదాడి జరిగిందని, అమాయకులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. వారిని స్మరించుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో తమ వారిని కోల్పోయిన కుటుంబాలకు, బంధువులకు ప్రధాని సానుభూతి వ్యక్తం చేశారు. దుఃఖంలో, సంకల్పంలో దేశం మొత్తం ఐక్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు. భారత్ ఉగ్రవాదానికి ఎప్పటికీ తలవంచదని స్పష్టం చేశారు. ఉగ్రవాదుల కుట్రలు ఎన్నటికీ సఫలం కావని పేర్కొన్నారు. కాగా, గత సంవత్సరం ఏప్రిల్ 22న పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. హిందువులను లక్ష్యంగా చేసుకుని జరిగిన దాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు.

## రాష్ట్రంలో ఇక స్మార్ట్ మార్కెట్‌యార్డులు

హైదరాబాద్: రాష్ట్రంలోని మార్కెట్‌యార్డుల్లో అక్రమాలను నిరోధించేందుకు, పారదర్శక లావాదేవీలు, సజావుగా క్రయవిక్రయాలు నిర్వహించేందుకు వాటన్నింటినీ డిజిటలీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో 198 మార్కెట్‌యార్డులున్నాయి. ప్రస్తుతం వాటిలో కార్యకలాపాలు మాన్యువల్‌గా జరుగుతున్నాయి. రాష్ట్రంలో ఏటికేడు పంటల సాగు, దిగుబడి పెరుగుతున్నాయి. ఫలితంగా మార్కెట్‌యార్డులకు వచ్చే ఉత్పత్తులూ ఎక్కువవుతున్నాయి. అయినా ఆదాయంలో మాత్రం పెరుగుదల కనిపించడం లేదు. గత నాలుగేళ్లుగా నికరంగా రూ.250 కోట్ల మేరకు రాబడి ఉంది. దీనికి కారణం యార్డుల్లో సరకుల రాకపోకలు నమోదు సరిగా జరగకపోవడమే. పలువురు వ్యాపారులు సరకులకు రుసుములు చెల్లించకుండా జీరో దందాతో క్రయవిక్రయాలు జరుపుతున్నారు. యార్డుల్లో ఆన్‌లైన్ సేవలు లేవు. కొందరు అధికారులు, మార్కెటింగ్ సిబ్బంది వ్యాపారులకు సహకరించడం వల్ల రూ.లక్షల్లో మార్కెటింగ్ రుసుమును చెల్లించకుండా తప్పించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అన్ని యార్డులను డిజిటలీకరించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల ఆదేశించారు.

**కొత్త సాఫ్ట్‌వేర్..**

డిజిటలీకరణలో భాగంగా అధికారులు ఐటీ, ఏఐ సాంకేతికతలతో స్మార్ట్ మార్కెట్‌యార్డు సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేశారు. దీన్ని ముందుగా గడ్డిఅన్నారం మార్కెట్‌లో ప్రారంభించి, తరువాత మిగిలిన యార్డుల్లో ప్రవేశపెట్టనున్నారు. మార్కెట్‌యార్డు ప్రవేశద్వారాల వద్ద, తూకం బ్రిడ్జిల వద్ద సెన్సర్లను అమర్చి కంప్యూటర్లకు అనుసంధానం చేస్తారు. ఏఐ ఆధారిత సర్వైలెన్స్ కెమెరాలను ఏర్పాటు చేస్తారు. వీటి ద్వారా మార్కెట్లోకి వచ్చే వాహనాలు, వాటిలోని సరకులు, వాటి తూకం వివరాలు నమోదవుతాయి. కొనుగోళ్లు, రవాణా, తరలింపు వివరాలు కూడా తెలుస్తాయి. వాటి రసీదులు ఆన్‌లైన్‌లో సిద్ధమవుతాయి. ఈ వివరాలన్నీ మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యాలయానికి ఎప్పటికప్పుడు చేరతాయి. ఎవరైనా వ్యాపారులు మద్దతు ధరల కంటే తక్కువకు కొనుగోలు చేస్తే.. దానికి కారణాలను విశ్లేషించి, అవి సహేతుకంగా ఉంటేనే ఆమోదిస్తుంది.

## ఆర్టీసీ సమ్మె... హైదరాబాద్ మెట్రో కీలక నిర్ణయం

నేటి నుంచి ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణాలు పెట్టుకున్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా, హైదరాబాద్ నగరంలో బస్సులు అందుబాటులో లేకపోవడంతో కార్యాలయాలకు, పనులకు వెళ్లేవారు అవస్థలు పడుతున్నారు. దీనితో హైదరాబాద్ మెట్రో సర్వీసులను పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. వివిధ మార్గాల్లో సర్వీసులను పెంచుతున్నామని మెట్రో రైలు వెల్లడించింది. మియాపూర్‌ఎల్బీనగర్ కారిడార్, నాగోల్‌రాయదుర్గం కారిడార్‌లలో మెట్రో సేవలను పెంచింది. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రాత్రి 11 గంటల తర్వాత కూడా మెట్రో సర్వీసులను పొడిగించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు మెట్రో ఎండీ వెల్లడించారు. మియాపూర్‌ఎల్బీనగర్ కారిడార్‌లో సాధారణంగా పీక్ అవర్‌లో ప్రతి 3 నిమిషాల 40 సెకన్లకు ఒక రైలు, నాన్ పీక్ అవర్లలో 4 నిమిషాల 50 సెకన్లకు ఒక రైలు ఉంటుంది. ఇప్పుడు ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో రోజంతా 4 నిమిషాల 20 సెకన్లకు ఒక రైలును నడుపుతున్నట్లు తెలిపింది. నాగోల్‌రాయదుర్గం కారిడార్‌లో నాన్ పీక్ అవర్‌లో 5 నిమిషాల 20 సెకన్లకు ఒక రైలు ఉంటుంది. కానీ ఇప్పుడు రోజంతా 3 నిమిషాల 40 సెకన్లకు ఒక రైలు నడుపుతున్నట్లు వెల్లడించింది.

## ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే గండ్ర



భూపాలపల్లి, ప్రజాస్ఫూర్తి : భూపాలపల్లి ఆర్టీసీ డిపో ముందు జరుగుతున్న ఆర్టీసీ కార్మికుల నిరసన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి మద్దతు తెలిపారు. బుధవారం ఉదయం డిపో వద్ద చేపట్టిన ఆందోళన లో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు న్యాయసమ్మతమైనవేనని అన్నారు. కార్మికుల సమస్యలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వాటిని పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. సంబంధిత మంత్రి పొన్నం తక్షణమే జోక్యం చేసుకుని కార్మికులతో చర్చలు ప్రారంభించాలని కోరారు. కార్మికుల హక్కుల కోసం జరుగుతున్న ఈ పోరాటం సమర్థనీయం అని పేర్కొన్న గండ్ర, ప్రభుత్వం ఆలస్యం చేయకుండా చర్చల ద్వారా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు.

## వివాహిత ఆత్మహత్య



ప్రజాస్ఫూర్తి, కాప్రా : అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ ఫ్యాన్కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. మృతురాలి తండ్రి తెలిపిన వివరాల ప్రకారం ... కర్ణాటక రాష్ట్ర బీదర్కు చెందిన రాజేందర్ సింగ్ సోనం ఠాకూర్ (26) ను 2020లో ఇందిరా నగర్, మౌలాలి కి చెందిన ఠాకూర్ యోగేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఒక కుమార్తె ఉంది. అయితే వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థానికంగా కలకలం రేపింది.ఫిర్యాదుదారుడు (బీదర్, కర్ణాటక) తెలిపిన వివరాల ప్రకారం, ఆయన కుమార్తె నివాసి 2020లో వివాహం చేశారు. వివాహానంతరం దంపతులు మౌలాలి హెచ్‌బీ కాలనీ పరిధిలో నివసిస్తూ ఉండగా, వారికి ఒక కుమార్తె ఉంది.ఈ నెల 20వ తేదీ సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో, తన కుమార్తెకు పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ స్పందన రాకపోవడంతో రాజేందర్ సింగ్ అనుమానంతో పక్కింటి నివాసి భారతేశ్వరమ్మను సంప్రదించారు. ఆమె ఇంటికి వెళ్లి పరిశీలించగా, సోనం ఠాకూర్ బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఉన్నట్లు గమనించారు. తక్షణమే ఆమెను కిందకు దించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న వెంటనే భర్త యోగేష్ , కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు.మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

* **స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ భాస్కరరావు**




భువనగిరి, ప్రజాస్ఫూర్తి : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం మినీ మీటింగ్ హాల్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతి ఇంజనీర్ల తో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు సొంత ఇంటి కళ నెరవేర్చే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే స్లాబ్ లెవెల్ పూర్తి అయిన ఇండ్లకు గృహప్రవేశాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పి డి శ్రీరాములు, డీఈ , ఎఈ లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాలలు వసతి గృహాలలో మరమత్తు పనులను వేసవి సెలవులలో పూర్తి చేయాలి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : రామన్నపేట మండలంలో అదనపు కలెక్టర్ భాస్కరరావుపర్యటించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎస్సీ బాలుర హాస్టల్ ను సందర్శించి హాస్టల్లో ఉన్న రిపేర్లను గుర్తించాలని ,హాస్టల్ ప్రత్యేక అధికారిని, హాస్టల్ వార్డెన్ కు సూచించారు.అనంతరం జనంపల్లి లోని రెసిడెన్షియల్ కళాశాలను సందర్శించి ప్రిన్సిపాల్ హాజరు కాకపోవడం గమనించడం పై ఎందుకు హాజరు కాలేదని ఆరా తీసి ఆగ్రహం వ్యక్తం చేశారు.తదుపరి మండల పరిషత్ కార్యాలయంలో ఎం.పి.డి. ఓ, ఎం.పి.ఓ , ఏ.పి. ఎం లతో సమీక్ష సమావేశం నిర్వహించి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు త్రాగు నీరు, టెంట్ , తదితర మౌలిక వసతులు అందుబాటులో ఉంచాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేపట్టాలన్నారు. వేసవి లో తాగు నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నీటి సరఫరా చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పురోగతి పై అడిగి తెలుసుకొని వివిధ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పేమెంట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి స్వర్గీయ ఇంద్రారెడ్డి కి ఘన నివాళి



వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి స్వర్గీయ ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా బుధవారం చేవెళ్ల మండలం కౌకుంట్ల లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి గారు నాయకులు కార్తీక్ రెడ్డి తో పాటు వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ లు పాల్గొని నివాళ్ళులర్పించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సమ్మెకు న్యూడెమోక్రసీ, ఐఎఫ్టీయూ సంపూర్ణ మద్దతు




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: బుధవారం ప్రారంభమైన ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టీయూ) సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా నాయకులు కొత్తగూడెం డిపోకు వెళ్లి కార్మికులను కలిసి సంఘీభావం తెలిపారు.సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, ఐఎఫ్టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.సంజీవ్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమ్మె న్యాయసమ్మతమని, ఇందులో స్వార్థం ఏమీ లేదని, సంస్థ సంక్షేమం కోసమే పోరాటమని పేర్కొన్నారు.వారి ప్రధాన డిమాండ్లు ఇవి: ఆర్టీసీ సంస్థ ద్వారానే కొత్త బస్సులు ప్రవేశపెట్టడం, ప్రభుత్వం బకాయిలు చెల్లించడం, ఖాళీ పోస్టుల భర్తీ, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, యూనియన్లతో చర్చలు జరపడం, వేతన సవరణ చట్టం తీసుకురావడం. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు.ఈ సమస్యలను పరిష్కరించి, కార్మికులతో చర్చలు జరిపి సమ్మెను ముగించాలని, ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోత్కూరి మల్లికార్జునరావు, జి.సంజీవరావు, లిక్కి నరేష్, జీవన్, సాగర్, కనకాచారి, రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

* **స్తంభించిన ఆర్టీసీ చక్రం.. డిపో వద్ద ఉద్రిక్తత**

కొత్తగూడెం: ఆర్టీసీ కార్మికుల సమ్మెతో బుధవారం ఉదయం నుంచి డిపో పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన సమ్మె ప్రభావంతో బస్సుల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. డిపో ప్రధాన ద్వారం ముందు కార్మిక సంఘాలు బైఠాయించి బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నాయి. ఈ క్రమంలో ఆందోళనకారులు, పోలీసుల మధ్య వాగ్వివాదం, తోపులాట చోటుచేసుకుని పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకుని చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా ఆర్టీసీ ఎంప్లాయాస్ యూనియన్ రాష్ట్ర నేత కందుల భాస్కర్ మాట్లాడుతూ శాంతియుతంగా సాగుతున్న నిరసనపై పోలీసులు అక్రమంగా అరెస్టులు చేయడం అన్యాయమన్నారు. ఎన్ని ఆంక్షలు విధించినా వెనకడుగు వేయబోమని, డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం మొండి వైఖరి వల్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, కార్మికుల ఐక్యతతోనే డిమాండ్లు సాధించుకుంటామని పేర్కొన్నారు. ఈ ఆందోళనలో సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, గెద్దాడు నగేష్, భూక్యా శ్రీనివాస్, కె.రత్నకుమారి, లక్ష్మీనారాయణ, షాహీమ్, కైసర్, షమీమ్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మద్దతు




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం టి ఎస్ ఆర్ టి సి కార్మికులు బుధవారం నుండి జరుపుతున్న సమ్మెకు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా సంపూర్ణ మద్దతును తెలియజేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాయం చిన్న చంద్రన్న అన్నారు. సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ మహబూబాబాద్ లోని జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కార్మికులు చేస్తున్న సమ్మె టెంట్ల వద్దకు పోయిన కాంగ్రెస్ నాయకులు ఆర్టీసీ కార్మికుల సమస్యలు న్యాయమైనవి వెంటనే పరిష్కరించాలని చేసిన డిమాండ్ నేడు తప్పుగా ఎందుకు కనిపిస్తుందని ఆయన అన్నారు. రకరకాల పేర్లతో కాలయాపన చేస్తూ కార్మికులను మభ్యపరిస్తే నేడు సమ్మెలోకి వెళ్లిందని అన్నారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెలోకి పోవటానికి రాష్ట్ర ప్రజానీకం ప్రయాణాలు అతలాకుతలం కావటానికి రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం ఏకైక కారణం అని అన్నారు. సమ్మె నోటీస్ ఇచ్చి 41 రోజులు గడిచిన చర్చలకు పిలవకపోవడం, చర్చలు ఎవరితో జరపాలని రవాణా శాఖ మంత్రి బాధ్యతారాహిత్యం గా మాట్లాడటం సరికాదన్నరు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయటం ప్రైవేటీకరణను ఆపివేయటం బకాయి వేతనాలు చెల్లించడంతోపాటు వేతనాలు పెంచాలని కార్మికులు చేస్తున్న డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రజాపాలన లో నిన్నటి వరకు విద్యుత్ శాఖ ఉద్యోగులు సమ్మె, నేను ఆర్థిక సంయపాక పట్టడం రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత పాలన కు నిదర్శనం అని అన్నారు. వేషజాలను పోకుండా ఆర్టీసీ కార్మికులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మిక వర్గం ఐక్యంగా సమరశీల పోరాటాలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఇంకా ఈ సమావేశంలో సిపిఐ (ఎంఎల్) మాసులైన ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి, జిల్లా నాయకులు పూనెం ప్రభాకర్, ముంజంపల్లి వీరన్న, బిళ్ళ కంటి సూర్యం,ఉమ్మగాని సత్యం తదితరులు పాల్గొన్నారు.

## వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడు అరెస్ట్

* **వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఆదినారాయణ**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ వివరాలు వెల్లడించారు. ఏప్రిల్ 20, 2026 అర్ధరాత్రి చుంచుపల్లి మండలం ధన్‌బాద్ పోచమ్మ గుడిలో హుండీ పగలగొట్టి అందులోని రూ.300 నగదు, అమ్మవారి త్రిశూలాన్ని దొంగిలించిన ఘటన చోటుచేసుకుంది. అదే రాత్రి రామవరం వన్నందాసుగడ్డలోని భూక్య లావణ్య కిరాణా దుకాణంలోకి చొరబడి రూ.4000 నగదు, మద్యం సీసాలు అపహరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ రెండు ఘటనలపై టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు అయ్యాయి.దర్యాప్తులో భాగంగా సీఐ డి. ప్రతాప్ తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పాలిటెక్నిక్ కాలేజీ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతను మర్రిగూడెం గ్రామానికి చెందిన మడివి భద్రయ్యగా గుర్తించారు. విచారణలో పై రెండు దొంగతనాలకు తానే పాల్పడ్డానని ఒప్పుకున్నాడు.పోచమ్మ గుడిలో హుండీ పగలగొట్టి నగదు తీసుకున్నానని, ఇంకా ఏమైనా దొరుకుతాయనే ఉద్దేశంతో వెతుకుతుండగా అమ్మవారి చేతిలోని త్రిశూలాన్ని లాగడంతో విగ్రహానికి నష్టం కలిగిందని తెలిపాడు. అలాగే కిరాణా దుకాణంలో చొరబడి నగదు, మద్యం సీసాలు దొంగిలించినట్లు వెల్లడించాడు. నిందితుడి వద్ద నుంచి 13 క్వార్టర్ మద్యం సీసాలు, రూ.300 నగదు స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ దొంగతనం కేసును త్వరగా ఛేదించినందుకు సీఐ డి. ప్రతాప్, ఎస్సై బి. కిషోర్ తదితర సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

* **సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి: డీఎస్పీ**

ఈ కేసులో సీసీ ఫుటేజ్ కీలక పాత్ర పోషించిందని డీఎస్పీ ఆదినారాయణ తెలిపారు. ప్రజలు తమ ఇళ్లు, వీధులు, దుకాణాలు, దేవాలయాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీంతో నేరాలను అరికట్టడమే కాకుండా నిందితులను త్వరగా గుర్తించడం సులభమవుతుందని చెప్పారు.

## వెంటనే ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించాలి

* **సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు డిమాండ్**



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: తమ న్యాయమైన డిమాండ్లు కోసం రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు సిపిఐ మద్దతు తెలుపుతూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పోలీసుల పహారాలో బస్సులు నడపాలని యాజమాన్యం ప్రయత్నిస్తుంటే ఆర్టీసీ కార్మికులతో కలిసి బస్సులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ వెంటనే డిమాండ్లను ఒప్పుకొని కార్మికులకు న్యాయం చేయాలన్నారు గత బి ఆర్ ఎస్ హయాంలో సమ్మె చేస్తున్న కార్మికులను అణగదొక్కాలని చూస్తే టిఆర్ఎస్ ప్రభుత్వానికి ఏ గతి పట్టిందో గమనించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అద్దెకు డ్రైవర్లను తీసుకువచ్చి బస్సులను నడపాలని ప్రభుత్వాన్ని చూస్తుందన్నారు. కొన్ని ప్రాంతాలలో బస్సులు నడపరాని ఆర్టీసీ డ్రైవర్లను ఉపయోగించడం ద్వారా కరీంనగర్ తదితర ప్రాంతాల్లో యాక్సిడెంట్లు అయినాయన్నారు ఇది ప్రభుత్వం గమనించాలన్నారు ఇప్పటికైనా ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను ఒప్పుకొని సమ్మె విరమించేలా చూడాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా సిపిఐ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రంలో బస్ డిపోల దగ్గర పాల్గొంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి విజయసారధి, సహాయ కార్యదర్శి బి అజయ్ సారధి రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్, పెరుగు కుమార్, దేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వరిపల్లి వెంకన్న, వెలుగు శ్రావణ్, చొప్పరి శేఖర్, ఆబోతు అశోక్, రాగం మల్లయ్య, జంపాల వెంకన్న, బాలాజీ ,కూన సత్యం ,బోళ్ల భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీజేపీ సంపూర్ణ మద్దతు



వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని బుధవారం వికారాబాద్ జిల్లా కేంద్రం లో చేపట్టిన ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీజేపీ వికారాబాద్ మండల శాఖ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులకు చేస్తున్న సమ్మెలో జిల్లా మాజీ అధ్యక్షులు సదానంద్ రెడ్డి తో కలిసి సమ్మెలో పాల్గొన్నారు.

## సత్తుపల్లి కాలువ పనులు వేగవంతం చేయాలి: మంత్రి తుమ్మల



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్‌లో భాగమైన సత్తుపల్లి ట్రంక్ కాలువ పనులను వేగవంతం చేసి వర్షాకాలానికే గోదావరి జలాలు అందించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. యతలకుంటలో నిర్వహించిన సమీక్షలో పనుల పురోగతిని పరిశీలించి లోపాలపై సూచనలు చేశారు.43 కిమీ పొడవున 1.46 లక్షల ఎకరాలకు నీరు అందించే లక్ష్యంతో రూ.700 కోట్ల ప్రాజెక్టులో ఇప్పటికే రూ.600 కోట్ల పనులు పూర్తయ్యాయని తెలిపారు. యతలకుంట టర్మినల్‌లో మిగిలిన పనులు 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణ, కోర్టు కేసుల కారణంగా ఆలస్యం జరిగితే వెంటనే కలెక్టర్ల దృష్టికి తీసుకురావాలని, చిన్న సమస్యలతో పనులు ఆగకూడదని స్పష్టం చేశారు. అవసరమైతే అదనపు సిబ్బందితో రాత్రింబవళ్లు పని చేసి ఈ సీజన్‌లోనే నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రాజెక్ట్ పూర్తయితే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో లక్షల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని మంత్రి తెలిపారు.

## కమలానగర్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఎన్నికల్లో గంట ప్యానల్ విజయం



ప్రజాస్ఫూర్తి, కాప్రా : కాప్రా సర్కిల్ పరిధిలోని కమలానగర్‌లో ఆదివారం జరిగిన సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఉత్కంఠభరితంగా సాగాయి. మొత్తం 11 సభ్యులతో పోటీకి దిగిన గంట ప్యానల్‌కు సభ్యుల నుంచి విశేష మద్దతు లభించి, ఆ ప్యానల్‌కు చెందిన 9 మంది అభ్యర్థులు విజయం సాధించారు.స్టార్ ప్యానల్ కూడా గట్టి పోటీ ఇచ్చినప్పటికీ, ఇద్దరు మాత్రమే విజయం సాధించగా, మిగిలిన వారు స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఈ పోటీ ఎన్నికలను మరింత రసవత్తరంగా మార్చింది.ఈ ఎన్నికల్లో అధ్యక్షులుగా సి.ఎన్. రావు, ప్రధాన కార్యదర్శిగా జి.వి. నారాయణ, కోశాధికారిగా టి. హేమలత (స్టార్ ప్యానల్), ఉపాధ్యక్షులుగా వై. రాజేశ్వర్ (స్టార్ ప్యానల్), సంయుక్త కార్యదర్శిగా ఆర్. ముత్యాలు ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా పి. గణపతి రెడ్డి, ఎస్.ఎస్.వి. ప్రసాద్, ఆర్. రవీంద్రనాథ్ చార్యులు, ఏం. సాంబశివరావు, పైళ్ళ శంకర్ రెడ్డి, కె. యశోద దేవి లు విజయం సాధించారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు సి.ఎన్. రావు, ప్రధాన కార్యదర్శి జి.వి. నారాయణ మాట్లాడుతూ కమిటీ సభ్యుల సహకారంతో సీనియర్ సిటిజన్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అలాగే కార్యాలయంలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు.నూతన కమిటీ సభ్యులను కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు బూడిద జనార్ధన్ గౌడ్, దత్తు, పెంటయ్య గౌడ్ తదితరులు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఐఐటి/జేఈఈ మెయిన్స్ 2026 ఫలితాలలో గిరిజన గురుకులాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ

* **గురుకులాల ప్రాంతీయ సమన్వయ కర్త పి. రత్నకుమారి**



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి : గిరిజన గురుకులాల విద్యార్థులు ఐఐటి/జేఈఈ మెయిన్స్ 2026 ఫలితాలలో అద్భుతమైన ప్రతిభను కనబరిచారని గురుకులాల ప్రాంతీయ సమన్వయ కర్త పి. రత్నకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిలో దామరవంచ టిజిటిడబ్ల్యూఆర్జెసి (బాయ్స్) చెందిన గుగులోతు శేఖర్ 90% పర్సంటైల్ తో ఎస్టి విభాగంలో 1593 ర్యాంకు ఈఎంఆర్ఎస్ సిరోల్ కు చెందిన నందిని 88%, ఈఎంఆర్ స్ గూడూర్ కు చెందిన లూనావత్ ఝాన్సీ 78% సాధించారన్నారు.జేఈఈ మెయిన్స్ లో ప్రశంసనీయమైన విజయం రావడంతో ఆర్ సి ఓ., అధ్యాపకులను, విద్యార్థులను అభినందించారు


# సమగ్ర ప్రణాళికతో పట్టణ అభివృద్ధి సాగాలి: మంత్రి పొంగులేటి



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఇల్లందు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. బుధవారం ఆయన ఇల్లందులో పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు, మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గది ప్రారంభం చేశారు. అనంతరం కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు. పట్టణ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని, ఇచ్చిన హామీలు తప్పకుండా నెరవేర్చుతామని మంత్రి స్పష్టం చేశారు. వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రజలతో నిరంతరం మమేకమై సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి దిశగా దూసుకెళ్తోందన్నారు. కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ 24 వార్డుల్లో పారిశుద్ధ్యం, లైటింగ్, తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, గృహ నిర్మాణ శాఖ ఫీడింగ్ రవీందర్ నాథ్, తాసిల్దార్ ఎంపీడీవో ధన్సింగ్,మున్సిపల్ వైస్ చైర్మన్ రాజు, మున్సిపల్ కమిషనర్ సంబంధిత శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఒక్కరోజే ముగ్గురు అధికారుల అరెస్ట్

- **లంచగొండి వ్యవస్థపై ఏసీబీ గట్టి దెబ్బ**
- **మహిళా సీఐ, ఎస్సై, ఆర్డీవో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడి అవినీతికి చెక్**



వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్రంలో అవినీతి అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఉక్కుపాదం మోపుతోంది. ప్రజల సేవ కోసం నియమితులైన కొందరు అధికారులు లంచాల కోసం చేతులు చాచడం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా మంగళవారం ఒక్కరోజే ముగ్గురు అధికారులు వికారాబాద్ జిల్లాలో ఇద్దరు మహిళా పోలీస్ అధికారులు, నారాయణపేటలో ఒక ఆర్డీవో లంచం తీసుకుంటూ ఏసీబీ వలలో చిక్కడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

**వరకట్న కేసులో బెయిల్ కోసం లంచం డిమాండ్**

వికారాబాద్ మహిళా పోలీస్ స్టేషన్‌కు చెందిన సీఐ సరోజ, ఎస్సై రాణి ఒక వరకట్న వేధింపుల కేసులో నిందితులకు స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి రూ.60 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. తాండూరుకు చెందిన ఇర్షాద్ అనే వ్యక్తి నుంచి ముందుగా రూ.20 వేల తీసుకున్న వారు, మిగిలిన డబ్బు కోసం పదేపదే ఒత్తిడి చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు.మంగళవారం బాధితుడి నుంచి మిగిలిన రూ.20 వేల తీసుకుంటుండగా, ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా వారిని పట్టుకున్నారు. ఈ ఘటనతో పోలీస్ శాఖలో అవినీతి నిర్మూలనపై మరోసారి చర్చ మొదలైంది.

**జనన ధ్రువీకరణ పత్రాల కోసం ఆర్డీవో లంచం**


ఇదే రోజు నారాయణపేట జిల్లాలో కూడా ఒక కీలక అధికారి లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఊట్కూర్ మండలానికి చెందిన ఓ వ్యక్తి ఐదు జనన ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అయితే, పది నెలలుగా కార్యాలయం చుట్టూ తిరిగినా పని జరగకపోవడంతో, చివరకు ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.5 వేల చొప్పున మొత్తం రూ.25 వేల లంచం ఇవ్వాల్సి వచ్చింది.బాధితుడు ఇచ్చిన సమాచారంతో ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలోని బృందం కార్యాలయంలోనే ఆర్డీవో రాంచందర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

**నెల రోజుల్లో 8 మంది పోలీసుల అరెస్ట్**

ఇటీవలి కాలంలో అవినీతి కేసులు పెరుగుతున్న నేపథ్యంలో, గత నెల రోజుల వ్యవధిలోనే ఏసీబీకి పట్టుబడిన పోలీసుల సంఖ్య 8కి చేరడం ఆందోళన కలిగిస్తోంది. సిరిసిల్ల, నిర్మల్, నాగర్‌కర్నూల్ జిల్లాలతో పాటు హైదరాబాద్ విమానాశ్రయంలో కూడా అధికారులు లంచం తీసుకుంటూ పట్టుబడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ వరుస అరెస్టులు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తున్నాయి అవినీతి చేసిన వారెవ్వరైనా తప్పించుకోలేరు. ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే, చట్టం వారి పక్షాన నిలుస్తుందని ఈ ఘటనలు నిరూపిస్తున్నాయి. ప్రభుత్వ సేవలు ప్రజల హక్కు, లంచం కాదు అనే భావన సమాజంలో బలపడాల్సిన అవసరం ఉంది.ప్రజల నమ్మకాన్ని కాపాడటం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యత. అవినీతికి పాల్పడే అధికారులపై కఠిన చర్యలు కొనసాగితేనే పారదర్శక పాలన సాధ్యమవుతుంది.

# తదుపరి విచారణకు, సీబీఐ దర్యాప్తునకు హైకోర్టు తీర్పు అడ్డుకాదు

- **పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్**



దిల్లీ: ''జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌పై హైకోర్టు ఇచ్చిన తీర్పు కాళేశ్వరంలో జరిగిన అవినీతిపై విచారణకు, సీబీఐ దర్యాప్తునకు ఏమాత్రం అడ్డు కాదు. ఈ కేసులో అభియోగాలు మోపిన వ్యక్తులు.. తమ వాదనలు వినిపించుకునేందుకు అవకాశం ఇవ్వడంలో జాప్యం జరిగిందని, ఆ నివేదిక ఆధారంగా తక్షణ చర్యలు ఉండకూడదని మాత్రమే కోర్టు చెప్పింది. అదే సమయంలో ఎవర్నీ నిర్దోషులుగా తేల్చలేదు. ప్రస్తుత తీర్పు దోషులకు తాత్కాలిక ఉపశమనమే' అని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ స్పష్టంచేశారు. తెలంగాణ ప్రజల సొమ్మును నీళ్లలో పోసిన వారిని వదిలే ప్రసక్తే లేదన్నారు. విచారణకు సీబీఐ ముందుకురాని పక్షంలో... ఏం చేయాలనేదానిపై రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోందని, అవసరమనుకుంటే దిల్లీకొచ్చి ధర్నా చేస్తామని స్పష్టంచేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి నిజాయతీ ఉంటే తక్షణం సీబీఐ దర్యాప్తు ప్రారంభించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. బుధవారం ఇక్కడ తెలంగాణభవన్‌లో విలేకర్లతో మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ... ''కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాలు, అవకతవకలు, అక్రమాలపై జస్టిస్ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను హైకోర్టు ఎక్కడా తప్పుబట్టలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన విజిలెన్స్ కమిషన్ కూడా ఈ మొత్తం వ్యవహారానికి బాధ్యులెవరు, దోషులెవరు, ఎక్కడెక్కడ తప్పులు జరిగాయో స్పష్టమైన నివేదిక ఇచ్చింది. కేంద్రం ఆధ్వర్యంలోని ఎన్‌డీఎస్‌ఏ కూడా బ్యారేజీల నిర్మాణంలో జరిగిన అవకతవకలు, కుంగుబాటుకు దారితీసిన కారణాలు, నిర్మాణ స్థలం, డిజైన్లలో లోపాలను నివేదిక రూపంలో అందించింది. భారాస నాయకులు దోషులు కాదని, అవినీతికి పాల్పడలేదని, కాళేశ్వరం కుంగిపోలేదని హైకోర్టు తీర్పులో పేర్కొనలేదు. కాబట్టి ఈ తీర్పు ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతిపై తదుపరి విచారణకుగానీ, సీబీఐ విచారణకుగానీ ఎంతమాత్రం అడ్డు కాదు' అని ఆయన పేర్కొన్నారు.

# ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే మురళి నాయక్

- **సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి**
- **డిఈఓకు ఎమ్మెల్యే మురళి నాయక్ ఆదేశాలు**



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ ప్రభుత్వం రేవంత్ రెడ్డి పాలనలో విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తుందని మహబూబాద్ ఎమ్మెల్యే డా” భూక్య మురళి నాయక్ అన్నారు. బుధవారం మహబూబాద్ మున్సిపాలిటీలోని 35వ వార్డు వెంకటేశ్వర బజారు నందు ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే మురళి నాయక్ అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉదయం 10:30 గంటలకే ఉపాధ్యాయులు, విద్యార్థులు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే డిఇఓ రాజేశ్వరరావు కి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి పాఠశాలకు సమయపాలన పాటించని ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మురళి నాయక్ ఆదేశించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ విద్యా ,వైద్యం అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుంటుందని దీనిలో భాగంగానే డైట్, మెస్ ఛార్జీలు పెంచి విద్యార్థులకు స్నాక్స్, టిఫిన్ అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చే విధంగా ఉపాధ్యాయులు వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.గతంలో ఎన్నడు లేని విధంగా ఎమ్మెల్యే మురళి నాయక్ పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ ఖలీల్ ,జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎడ్ల రమేష్,మాజీ వార్డు కౌన్సిలర్ చలమాల నారాయణ మాజీ పట్టణ అధ్యక్షులు రాజు గౌడ్,మాజీ వార్డు కౌన్సిలర్ భూక్యా శ్రీను,సురేష్,రాజేష్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇల్లెందులో గాలివాన బీభత్సం – ఎస్పీ ఆదేశాలు బేఖాతరు

- **బైక్‌పై కూలిన భారీ ఫ్లెక్సీ.. తృటిలో తప్పిన ప్రమాదం**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఇల్లెందు పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. బుధవారం సాయంత్రం వీచిన గాలివానకు పోలీస్ స్టేషన్ సమీపంలోని ప్రధాన రహదారిపై ఉన్న ఓ భారీ ఫ్లెక్సీ ఒక్కసారిగా కుప్పకూలి కింద పార్క్ చేసిన బైక్‌పై పడింది. ఘటన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఒకవేళ పాదచారులు లేదా చిన్నపిల్లలు అక్కడ ఉంటే ప్రాణనష్టం సంభవించే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఎస్పీ ఆదేశాలకు పట్టింపులేదా?**

ఇటీవల నిర్వహించిన 'అరైవ్‌అలైవ్' కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ప్రధాన రహదారులపై ప్రమాదకరంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని స్పష్టంగా ఆదేశించారు. ఇప్పటికే ఉన్న ఫ్లెక్సీలను కూడా వెంటనే తొలగించాలని మున్సిపల్ అధికారులకు, చైర్‌పర్సన్‌కు సూచించారు.

**అధికారుల నిర్లక్ష్యం వెలుగులోకి**

ఎస్పీ, డీఎస్పీ, మున్సిపల్ కమిషనర్ సమక్షంలోనే హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, మున్సిపల్ యంత్రాంగం ఆదేశాలను పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**బాధ్యత ఎవరిది?**

బుధవారం జరిగిన ఘటనకు బాధ్యత ఎవరు వహిస్తారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మంత్రి కార్యక్రమాల పేరుతో పట్టణమంతా భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**తక్షణ చర్యలకు డిమాండ్**

జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఈ ఫ్లెక్సీలను తొలగించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నేషనల్ ఫోరం ఫర్ పీపుల్స్ ఎంపవర్‌మెంట్ అండ్ సోషల్ జస్టిస్ జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

# పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తుంది

- **మున్సిపల్ కమిషనర్లు, విద్యాశాఖ, ఇంజనీరింగ్ విభాగం సిబ్బందితో సుదీర్ఘంగా సమావేశం నిర్వహించిన.జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్.**



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి : పట్టణాలు , గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని అధిక నిధులు కేటాయించడం జరుగుతుందని, గ్రామాలు పట్టణాలలో ప్రజలు తమ యొక్క ఇంటి పన్ను నల్ల పన్ను బాధ్యతాయుతంగా చెల్లించి గ్రామాలు పట్టణాల అభివృద్ధికి సహకరించాలని, విద్యాశాఖలో పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో,మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోతు జ్యోతి, కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోతు సునీత, వైస్ చైర్పర్సన్ అల్లం రమ, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత ఇంజనీరింగ్, హెల్త్, శానిటేషన్, విద్యాశాఖ సిబ్బందితో పెండింగ్ పనులు అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో పాటు ప్రజల సహకారంతో పట్టణాల అభివృద్ధికి సహకరించాలని, ఇంటి పన్ను, నల్లా పన్ను, ట్రెడ్ లైసెన్స్, లే అవుట్ అనుమతుల ద్వారా నిధులు సేకరించాలని, పన్నుల వసూళ్లకు విస్తృత ప్రచారం కల్పించాలని, బల్క్ ఎస్ఎంఎస్ ల ద్వారా ప్రజలకు తెలియపరచాలని, సూచించారు.మున్సిపల్ పరిధిలో నిత్యం సానిటేషన్ నిర్వహిస్తూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని దశలవారీగా సిబ్బందిని కేటాయించాలని, వారికి షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని, యూనిఫామ్స్ ఇతర సదుపాయాలు కల్పించాలని సూచించారు, బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరు నమోదు చేయాలని తెలిపారు.ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మిషన్ భగీరథ, మున్సిపల్ ద్వారా అందించే వాటర్ సప్లై నిత్యం గమనిస్తూ ఉండాలని, అవసరం ఉన్నచోట టాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని తెలిపారు. ఒక ప్రణాళిక ప్రకారం అన్ని విభాగాల సిబ్బంది పనిచేసి పట్టణాల అభివృద్ధికి కృషి చేయాలని ఆదేశించారు.ప్రభుత్వ స్థలాలలో అక్రమ నిర్మాణాలను అరికట్టాలని ఆదేశించారు,శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ వహించి అవసరం ఉన్నచోట ఆటోలు ట్రాక్టర్స్ ఇతర వాహనాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని సూచించారు. కేసముద్రం నూతన మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు,మహబూబాబాద్, కేసముద్రం మున్సిపల్ చైర్ చైర్పర్సన్లు పట్టణల అభివృద్ధి కోసం పలు సూచనలు సలహాలు అందించారు. అంతర్గత రోడ్ల నిర్మాణం అభివృద్ధి పనులు పార్కులు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వినియోగంలోకి తీసుకురావడం కోసం చర్యలు తీసుకోవాలన్నారు,ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు సమన్వయంతో కలిసి పనిచేసి పట్టణాలు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఆమె సూచించారు,విద్యాశాఖ లోని సుమారు (839) పాఠశాలలలో వివిధ అభివృద్ధి పనులు కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, టాయిలెట్స్, కాంపౌండ్ వాల్, త్రాగునీరు సరఫరా సిస్టం, మైనర్ రిపేర్, మన ఊరు మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా మంజూరు అయిన పనులు కొన్ని పెండింగ్లో ఉన్నందున అట్టి పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత పంచాయతీరాజ్, రహదారులు భవనాల శాఖ, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ విభాగం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సంస్థ, ఈ డబ్ల్యూ ఐ సి, అధికారులు ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి రాజేశ్వర్, కేసముద్రం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మహబూబాబాద్ ఇంచార్జీ కమిషనర్ ఉపేందర్, టిపిఓ సాయి రామ్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, విద్యా శాఖ ఇంజినీరింగ్,ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ లు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలి

- **ఆర్టీసీ కార్మికుల సమ్మెకు**
- **సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సంపూర్ణ మద్దతు,ర్యాలీ***



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: అనేక సంవత్సరాలుగా ఆర్టీసీ కార్మికుల శ్రమతో వేలకోట్ల రూపాయలతో నిర్మితమైన సంస్థను ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగానే దివాలు తీయించే కుట్ర చర్యలకు పాల్పడుతున్నారు, ఆర్టీసీని అన్యాక్రాంతం చేసే పరిస్థితిని పాలకులు తీసుకొచ్చారు. ఆర్టీసీ కార్మికులు వారిపై ఆధారపడిన వేలాది కుటుంబాలు భయాందోళనలో ఉన్నాయి. ఆర్టీసీలో కొంతకాలం నుండి పర్మినెంట్ ఉద్యోగాలు కూడా లేవు. ఆర్టీసీలో ప్రైవేటు బస్సులు అద్దెకు తీసుకొని ఆర్టీసీ రక్షణ కోసం కొత్త బస్సుల్ని తీసుకురాకుండా నిర్లక్ష్యం వహిస్తూ సంస్థను క్రమం క్రమంగా నిర్వీర్యం చేసే చర్యలకు గత ప్రభుత్వం లాగానే ఇప్పుడున్న ప్రభుత్వం కూడా పాత దారిలోనే నడుస్తుంది.సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ డిపో లో కార్మికులకు మద్దతుగా ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ మండల వెంకన్న భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు కామ్రేడ్ హలావత్ లింగన్న లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీలోకి ఇతర రాష్ట్రాల నుండి డ్రైవర్లని రిక్రూట్మెంట్ చేసుకుంటున్నారు.ఇది దారుణమైన పరిస్థితి ఇక్కడ వారికి కొత్త రిక్రూట్మెంట్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం,కార్మికులకు, ఆర్టీసీకి రక్షణ దొరికిద్దని ఎంతో ఆశపడ్డ కార్మికులకు నిరాశ మిగిలింది.కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఆర్టీసీ కార్మికులకు అనేక హామీలు ఇచ్చారు. ఈ రెండున్నర సంవత్సరాల నుండి ఆర్టీసీ రక్షణ కొరకు ఈ ప్రభుత్వ ఎటువంటి చర్యలు తీసుకోలేదు.పిఆర్సి విషయంలో, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే విషయం పట్టించుకోవడం లేదన్నారు. అర్ధరాత్రి నుండి జరగబోయే ఆర్టీసీ సమ్మెకు సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుంది.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు గుజ్జు దేవేందర్,బట్టు చైతన్య, నూకల మురళి, ఏకాంబరం, మునిత, కల్పన, కుక్కముడి యాకయ్య, గుండెల కృష్ణ, ఎండి జబ్బార్, తెలబోయిన కృష్ణ, రమ, కృష్ణవేణి, రజిత, పట్టాభి మల్లేశం, గువ్వ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞానానికి వారధి వినాశనానికి దారి కావద్దు

- **సాంకేతికతపై విద్యార్థులకు న్యాయ అవగాహన.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ**



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: నేటి ఆధునిక యుగంలో విద్యార్థులు మారుతున్న ప్రపంచీకరణ, సాంకేతిక విప్లవానికి అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవాలని మహబూబాబాద్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ మధ్యవర్తిత్వ న్యాయవాది వై. చెన్న మల్లా రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక చైతన్య టెక్నో స్కూల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో భాగంగా విద్యార్థులను ఉద్దేశించి వారు పలు కీలక సూచనలు చేశారు. సాంకేతిక విద్య ఒక వరం, నేటి పోటీ ప్రపంచంలో సాంకేతిక విజ్ఞానాన్ని కలిగి ఉండటం విద్యార్థులకు లభించిన గొప్ప అవకాశం అని అన్నారు.చైతన్య టెక్నో స్కూల్ వంటి సంస్థల్లో చదువుతూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్న మీరు ఎంతో అదృష్టవంతులు అని కొనియాడారు.సాంకేతికత ఎంతటి ప్రయోజనకరమో, దాన్ని తప్పుగా ఉపయోగిస్తే అంతటి ప్రమాదకరమని హెచ్చరించారు.సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ నేరాలు, అనవసరమైన వెబ్‌సైట్‌ల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒక చిన్న పొరపాటు మీ బంగారు భవిష్యత్తును చట్టపరమైన ఇబ్బందుల్లోకి నెట్టే అవకాశం ఉందని గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ వి. రాజ్ కృష్ణ మాట్లాడుతూ మొబైల్ ఫోన్లు కంప్యూటర్లను ఉపయోగించేటప్పుడు 'సైబర్ నేరాల ' పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు . ఇతరుల వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించడం లేదా అసభ్యకరమైన సందేశాలు పంపడం చట్టరీత్యా నేరమని విద్యార్థులకు వివరించారు.ఉచిత న్యాయ సహాయం / సలహా కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 15100 ను సంప్రదించవచ్చు అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ రూపొందించినటువంటి లఘు చిత్రాలను ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో , పాఠశాల ప్రిన్సిపల్ భార్గవి , భోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోపా జిల్లా అధ్యక్షుడిగా రిటైర్డ్ ఎమ్మార్వో కూర్మ యోగేశ్వర్ ఏకగ్రీవ ఎన్నిక



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా అఖిల భారత పద్మశాలి సంఘం అనుబంధం తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు చిలుకమారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్ర రావు,సంగారెడ్డి అధ్యక్షులు కొప్పెరి హరి హర కిషన్, కార్యదర్శి సోమ రమేష్ సమావేశానికి హాజరు కావడం జరిగింది.ఈ సమావేశంలో మహబూబాబాద్ జిల్లా పద్మశాలి కుల బాంధవుల ఆలోచనలను వ్యక్తపరుస్తూ సంఘ అభివృద్ధి కొరకు పాటుపడాలని ఏకాభిప్రాయంతో నిర్వహించడం జరిగినది.జిల్లా పోపా అధ్యక్షునిగా రిటైర్డ్ ఎమ్మార్వో కూర్మ యోగేశ్వర్ ని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా అనుమాల సిద్ధార్థ్ ను నియమించారు. ఈ సమావేశానికి గౌరవ అధ్యక్షులు అనుమాల వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ వన్నాల సాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సామల నరసయ్య, కోశాధికారి బొమ్మ వెంకటేశ్వరు,ఉపాధ్యక్షులు మామిడాల శ్రీనివాస్, మార్కండేయ గుడి అధ్యక్షులు కైరంకొండ వీరన్న, కూరపాటి ఆదినారాయణ, కుల బాంధవులు పాల్గొన్నారు.

# భూమిని రక్షించుకోవలసిన అవసరం ప్రతి ఒక్కరి పైన ఉంది

- **పర్యావరణవేత్త, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రొఫెసర్ ప్రసన్న కుమార్**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : భూమిని రక్షించుకోవలసిన అవసరం ప్రతి ఒక్కరి పైన ఉందని పర్యావరణవేత్త, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రొఫెసర్ ప్రసన్న కుమార్ అన్నారు. అంతర్జాతీయ భూమి దినోత్సవం సందర్భంగా బుధవారం జెడ్పి హెచ్‌ఎస్ సూరారం కాలనీ యందు కార్యక్రమం నిర్వహించారు. మనకు నీరు కావాలన్నా నీడ కావాలన్నా నివసించాలన్న భూమి ఉండాలి కావున భూమిని పరిరక్షించుకోవాలి భూమిని మాతృభూమిగా ప్రేమిస్తూ భూమాతను సంరక్షించుకున్నప్పుడే లోకమంతా ఉంటుందని 9 భూమిపైన ఎలాంటి ప్లాస్టిక్ వేయకూడదు ఇలాంటి చెత్తతో నింపకూడదు భూమిని సారవంతంగా ఉంచినప్పుడే పంటలు కూడా బాగా పండుతాయి అని వివరించారు ఈ కార్యక్రమంలోసామాజిక, పర్యావరణవేత్త కోలా రవీందర్ మాట్లాడుతూ రైతులు రసాయనిక ద్రవాలు వాడకుండా ప్రకృతి వ్యవసాయం పశువుల పేడతో పంటలు పండించాలని భూమాతను కాపాడుకోవాల ని ప్రతి విద్యార్థి మీ ఇంట్లో ప్లాస్టికవర్ వాడకుండా మార్కెట్ కి వెళ్ళినప్పుడు చేతి సంచులు తీసుకునివెళ్లే విధంగా మీ తల్లిదండ్రులను మార్చాలని విద్యార్థులకు చెప్పాడు అనంతరం భూమాతను రక్షించాలని అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం లో మల్లికార్జున , పుణ్యవతి , రవికుమార్ , జావిద్ , లక్ష్మణ్ , హనుమంతరావు , వెంకట్రావు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## రూ.98 వేల కోట్లతో
# రహదారుల అభివృద్ధి

* 2028 నాటికి దేశంలోనే తెలంగాణ మొదటి స్థానం
* క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశంలో భట్టి, కోమటిరెడ్డి



హైదరాబాద్: రాష్ట్రంలో రూ.98 వేల కోట్ల విలువైన రహదారుల నిర్మాణ అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రోడ్లుభవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ పనులను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్ల నిర్మాణంలో 2028 చివరి నాటికి దేశంలోనే తెలంగాణను మొదటి స్థానంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సచివాలయంలో బుధవారం డిప్యూటీ సీఎం అధ్యక్షతన మౌలిక వసతులు, మూలధనం పనులపై ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశమైంది. సబ్‌కమిటీ సభ్యులు, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, ఆర్‌అండ్‌బీ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ''రాష్ట్రంలో మూడేళ్ల కిందట నిర్మించిన వంతెనలకు అప్రోచ్ రోడ్లు నిర్మించ లేదు. దీంతో పలు చోట్ల నిరుపయోగంగా ఉన్నాయి. పెండింగ్‌లో ఉన్న అప్రోచ్ రోడ్ల పనులను వెంటనే చేపట్టాలి. ఆ రోడ్ల నిర్మాణానికి అవసరమైన రూ.148 కోట్ల మంజూరుకు క్యాబినెట్ సబ్‌కమిటీ ఆమోదం తెలిపింది'' అని భట్టి విక్రమార్క వివరించారు. మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ..''ఈ ఏడాది తెలంగాణలో నిర్వహించే ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సీ) సమావేశం అనంతరం రాష్ట్రానికి రూ.20 వేల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. రాబోయే వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని జూన్ 8వ తేదీ లోపు అప్రోచ్ రోడ్ల నిర్మాణం పూర్తికావాలి. టెండర్లు పిలవడం, పనులు చేపట్టడం, నాణ్యతతో పూర్తి చేయడం వంటి అని అంశాలను నేనే ప్రత్యేకంగా పర్యవేక్షిస్తాను. ఈ పనులు పూర్తయితే 300 గ్రామాల్లో నెలకొన్న సమస్యకు పరిష్కారం లభిస్తుంది'' అని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఉపముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

## యువజన క్రీడా వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్: ప్రజల వద్దకు ప్రభుత్వమే వెళ్లాలనే ప్రధాన ఉద్దేశంతో ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మంత్రులు శ్రీధర్‌బాబు, వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో బుధవారం ''ప్రజాపాలనప్రగతి ప్రణాళిక''లో నిర్వహించే యువజన క్రీడా వారోత్సవాల పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ''మే 1 నుంచి 12 వరకు జిల్లా కేంద్రాల్లో ఉద్యోగ మేళాలు నిర్వహిస్తున్నాం. మే 18 నుంచి 23 వరకు వివిధ క్రీడా కార్యక్రమాలను చేపడుతున్నాం. ఈ కార్యక్రమాల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలి. మంత్రులు, శాసనసభ్యులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాలకు హాజరయ్యేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి'' అని మంత్రులు పేర్కొన్నారు. శాట్స్ ఎండీ సోనీ బాలాదేవి, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్

# ఇంజనీరింగ్, డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలి

* ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి
* ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

మేడిపల్లి , ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల రాష్ట్ర వ్యాప్త సమ్మె సందర్భంగా ఉప్పల్ డిపో వద్ద బుధవారం ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని చేస్తున్న సమ్మెకు ఏఐఎస్ఎఫ్ మద్దతు ఇస్తుందన్నారు. ఈరోజు నుండి రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు సమ్మె చేయడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయన్నారు. ఈరోజు నుండి ఆర్టీసీ కార్మికుల సమ్మె ప్రారంభం వల్ల ఇంజనీరింగ్ ,డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు బస్సులు లేక చాలా ఇబ్బందులు పడి సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోలేకపోయారని, మహిళలకు ఉచిత బస్ నేపథ్యంలో ప్రతి విద్యార్థిని ఆర్టీసీ బస్సులోనే ప్రయాణిస్తు కళాశాలలకు వస్తున్నారని, అదేవిధంగా విద్యార్థులు ఆర్టీసీ బస్ పాస్ ల ద్వారా మారుమూల ప్రాంతాలు ,పల్లెటూరుల నుండి కళాశాలలకు వస్తున్నారని, అధికంగా విద్యార్థులు ఆర్టీసీ బస్సులు ఉపయోగిస్తున్నారని, అలాంటప్పుడు పరీక్షల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతారని, రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ, జేఎన్టీయూ అధికారులు వెంటనే విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా సెమిస్టర్ పరీక్షలను సమ్మె విరమణ అయ్యే వరకు తాత్కాలికంగా వాయిదా వేయాలని, విద్యార్థుల భవిష్యత్ కి ఇబ్బంది లేకుండా అధికారులు



ఆలోచించాలని,అదేవిధంగా రేపటి నుండి పాఠశాలలకు కూడా సెలవులు నేపథ్యంలో సంక్షేమ హాస్టల్, గురుకులాల్లో ఉండే విద్యార్థులు ఇంటికి వెళ్లడానికి కూడా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంటుందని, ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల 32 న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ,గతంలో రేవంత్ రెడ్డి ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు తమ అధికారంలోకి వస్తే ఆర్టీసీ కార్మికుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, ఆర్టీసీలో గుర్తింపు సంఘాల ఎన్నికల నిర్వహిస్తామని ఇంకా అనేక హామీలు ఇచ్చి ఇప్పటికీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు కావస్తా ఉన్న కమిటీలు వేసి కాలయాపన చేస్తున్నారు తప్ప ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించడం పూర్తిగా విఫలం చెందారని ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్య ధోరణిని ఖండిస్తూ ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్నారని వెంటనే ప్రభుత్వం వారి డిమాండ్లను పరిష్కరించాలని పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

## విధులకు హాజరయ్యే
# ఆర్టీసీ డ్రైవర్లందరికీ రక్షణ కల్పిస్తాం

* జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : విధులకు హాజరయ్యే ఆర్టీసీ డ్రైవర్లందరికీ రక్షణ కల్పిస్తామని, ఎవరైనా వారి విధులకు ఆటంకం కలిగిస్తే, అట్టి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను, ముఖ్యంగా ప్రజా రవాణా వ్యవస్థ అయిన ఆర్టీసీ బస్సులను ధ్వంసం చేసినా లేదా వాటి రాకపోకలకు ఆటంకం కలిగించినా చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ప్రజల సౌకర్యార్థం, విద్యార్థులు, ఉద్యోగులు , రోగుల రవాణా కోసం నడిచే బస్సులు ఉమ్మడి ఆస్తి అని, వాటిపై దాడులు చేయడం వల్ల అంతిమంగా సామాన్య ప్రజలే తీవ్ర ఇబ్బందులకు గురవుతారని పేర్కొన్నారు. ఏదైనా నిరసనలు లేదా ఆందోళనల సమయంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని బస్సులపై రాళ్లు రువ్వడం, అద్దాలు పగలగొట్టడం లేదా తగులబెట్టడం వంటి అరాచక చర్యలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. విధుల నిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్లను, కండక్టర్లను అడ్డుకోవడం లేదా వారిపై శారీరక దాడులకు పాల్పడటం తీవ్రమైన నేరమని, అటువంటి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. కేవలం భౌతిక దాడులే కాకుండా, సోషల్ మీడియా వేదికల ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తూ హింసను ప్రేరేపించే వారిపై కూడా నిఘా ఉంచామని ఎస్పీ హెచ్చరించారు. ఆందోళనలు జరిగే ప్రాంతాలను సీసీటీవీ కెమెరాలు, నిశితంగా పర్యవేక్షిస్తున్నామని, అల్లర్లలో పాల్గొనే వారిని వీడియో సాక్ష్యాధారాల ఆధారంగా గుర్తించి కఠినంగా శిక్షిస్తామని పేర్కొన్నారు. ఒకసారి ఇటువంటి కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులు కావడమే కాకుండా, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని యువతను హెచ్చరించారు.ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, అయితే అది శాంతియుత మార్గంలో,



చట్టబద్ధమైన పద్ధతుల్లో మాత్రమే ఉండాలని ఎస్పీ సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత భావోద్వేగాలకు లోనై తమ బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి గురించి సమాచారం తెలిస్తే వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

## 'సీతారామ' పనుల్లో అలసత్వాన్ని సహించేది లేదు

* మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సత్తుపల్లి: సీతారామ ప్రాజెక్టు పనుల్లో ఎవరు అలసత్వం వహించినా సహించేది లేదని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు. కాలువ పనులతోపాటు టన్నెల్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. భూసేకరణకు పూర్తిస్థాయిలో నిధులు మంజూరుచేసినా.. పురోగతి లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో భాగమైన సత్తుపల్లి మండలం యాతాలకుంట టన్నెల్ పనులను ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, అంకిత్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి తుమ్మల బుధవారం పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో... పరిహారం చెల్లింపులో ఒక రైతు ఖాతాలో పడాల్సిన పరిహారం మరొకరికి పడటంతో పనులు నిలిచిన అంశాన్ని అధికారులు తుమ్మల దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన మండిపడ్డారు. 'ఆరు నెలల క్రితం సమస్య వచ్చినప్పుడు ఇంతవరకు ఏంచేస్తున్నారు.. కలెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించి పనులు చేయాలి కదా.. రూ.10వేల కోట్లతో చేస్తున్న పనులపై బాధ్యత లేకపోతే ఎలా' అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. 'నాకు చెప్పినా పనులు ఆగకుండా చూసేవాడిని కదా' అని పేర్కొన్నారు.

# పాటతో మొదలైన నా ప్రయాణం..

## సక్సెస్ స్టోరీ మానసి పరేఖ్



సింగింగ్‌తో మొదలైన ఆమె కెరీర్.. యాక్టింగ్‌తో కొత్త మలుపు తీసుకుంది. ఇప్పుడు రెండింటిలోనూ సక్సెస్‌ఫుల్‌గా దూసుకెళ్తోంది. లేటెస్ట్‌గా 'జమ్‌కుడి' అనే సినిమాతో ఆడియెన్స్ ముందుకొచ్చింది. ఈ సినిమా కోసం ఆమె టైటిల్ ట్రాక్ కూడా పాడింది. ఇంతకీ ఆమె ఎవరంటే... గుజరాతీ యాక్ట్రెస్ మానసి పరేఖ్. ''ఇంతకుముందు కూడా నా సినిమాలకు నేను పాడా. 'కచ్ ఎక్స్‌ప్రెస్'లో 'కంగ్రాచ్యులేషన్స్' అనే పాట. నేను నటించిన సినిమాలో పాట కూడా పాడడం చాలా హ్యాపీగా అనిపిస్తుంది'' అంటోంది మానసి పరేఖ్. ఆమె సక్సెస్‌ఫుల్ జర్నీ గురించి మరిన్ని ముచ్చట్లు తెలుసుకుందాం.

నేను పుట్టింది గుజరాత్‌లో. పెరిగింది ముంబైలో. కాబట్టి రెండింటితో నాకు చాలా కనెక్షన్ ఉంటుంది. చిన్నప్పటి నుంచే మ్యూజిక్ అంటే ప్యాషన్. దాంతో అప్పుడే పాటలు పాడడంలో శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టా. స్కూల్ ఈవెంట్స్, రియాలిటీ షోలు వంటి వాటిల్లో యాక్టివ్‌గా పార్టిసిపేట్ చేశా. దాంతో మంచి పేరొచ్చింది. ఒకసారి ఒక షోకి సెలక్ట్ అయితే, అక్కడి నుంచి మరో అవకాశం దక్కేది. అలా వరుసగా ఎనిమిది టీవీ షోల్లో పార్టిసిపేట్ చేశా. వాటితోపాటు అడ్వర్టైజ్‌మెంట్స్‌లో కూడా కనిపించేదాన్ని. ఒకసారి ఫేమ్ వచ్చిందంటే.. వాళ్లు ఒక రంగంలోనే కాదు. వివిధ రంగాల్లో తమ టాలెంట్ ప్రూవ్ చేసుకునే అవకాశం కూడా వస్తుంది. నా విషయంలోనూ అదే జరిగింది. హిందీ, గుజరాతీ సినిమాలు, షార్ట్ ఫిల్మ్స్ ద్వారా నటనలోకి అడుగుపెట్టా. నాకు నటనలో నా స్కిల్స్ పెంచుకోవడానికి టీవీ షోలు ఉపయోగపడ్డాయి. అది కాకుండా నేను న్యూయార్క్‌లోని 'లీ స్ట్రాస్‌బర్గ్ థియేటర్ అండ్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్'లో

### 20 ఏండ్ల అనుబంధం

టెలివిజన్ ఇండస్ట్రీతో నాకు 20 ఏండ్ల అనుబంధం ఉంది. అక్కడ ఎన్నో విలువైన పాఠాలు నేర్చుకున్నా. టీవీలో పనిచేసేవాళ్లు ఎలాంటి పరిస్థితుల్లోనైనా తమ పని పూర్తి చేయాల్సి ఉంటుంది. వాళ్ల ఎమోషన్స్ అన్నీ పక్కన పెట్టి నటించాలి. అదెలా ఉంటుందంటే.. మిలిటరీ ట్రైనింగ్లా ఉంటుంది అనిపించింది నాకు. ఎన్ని పనులున్నా, ఎలాంటి సమస్యలున్నా ప్రతి రోజు షూటింగ్‌కి వెళ్లాల్సిందే. ఎలాంటి సిచ్యుయేషన్‌లో అయినా స్థిరంగా ఉండడం టెలివిజన్ నాకు నేర్పించింది. నాకున్న స్కిల్స్‌ను నేను రకరకాలుగా ఉపయోగించుకున్నా. టీవీలో నేను చాలా సవాళ్లు ఎదుర్కొన్నా. నేను 'గులాల్' అనే పాపులర్ షో చేశాను. ఆ షో సెట్ మా ఇంటికి గంటన్నర జర్నీ దూరంలో ఉంటుంది. అంటే, నేను అక్కడికి వెళ్లిరావడానికి జర్నీకి మూడు గంటలు టైం పట్టేది. సెట్లో 14 గంటలు ఉండాల్సి వచ్చేది. మొత్తంగా ప్రతిరోజు నేను 17 గంటలు కష్టపడేదాన్ని. ఏడు గంటలు మాత్రమే నిద్రపోయేదాన్ని. అలా ఒక సంవత్సరం పాటు చేశాను. అయితే, ఆరునెలలు గడిచాక ఒత్తిడి వల్ల హెల్త్ పాడయ్యింది. డాక్టర్ దగ్గరకి వెళ్తే నా ప్రొఫెషన్ గురించి అడిగారు. ఎందుకంటే అప్పటికీ నా కళ్ల చుట్టూ డార్క్ సర్కిల్స్ ఉన్నాయి. కాళ్లు వాచిపోయాయి. చెప్పాలంటే నా ప్రొఫెషన్‌కి నేను ఇలా ఉంటే పనిచేయలేను. అలాంటి సిచ్యుయేషన్‌ని దాటుకుని ఇక్కడి వరకు వచ్చా.


### కూతురుకి అంతే ఇంపార్టెన్స్ ఇస్తా

వర్క్‌ని, పర్సనల్ లైఫ్‌ని బ్యాలెన్స్ చేయడం చాలా కష్టం అనుకునేదాన్ని. ఇప్పుడు నా ప్రియారిటీలు ఏంటీ? అనేది నాకు తెలుసు కాబట్టి ఆ విధంగా మెయింటెయిన్ చేస్తున్నా. నా వర్క్‌కి ఎంత ఇంపార్టెన్స్ ఇస్తానో, నా కూతురుకి అంతే ఇంపార్టెన్స్ ఇస్తా. అమ్మ అంటే ఇంట్లో కూర్చుని పిల్లల్ని మాత్రమే చూసుకోవాల్సిన పనిలేదు. నేను సినిమాల్లోకి వచ్చి ఏడున్న ఏండ్లు అవుతుంది. నా కూతురు పుట్టాక, నేను ఏడు సినిమాల్లో నటించా. అంటే, ఏడాదికొక సినిమా చేశా అనుకోవచ్చు. అలా నేను వర్క్, ఫ్యామిలీ రెండింటినీ సమానంగా చూస్తా.

### 'జమ్‌కుడి'.. మర్చిపోలేని సక్సెస్

జమ్‌కుడి సినిమాలో నాది లీడ్ రోల్. అయితే మ్యూజిక్ డైరెక్టర్ ఒక పాట నువ్వు పాడాలని చెప్పారు. పాట అంటే నాకు ఎప్పుడూ ఇష్టమే కాబట్టి ఒప్పుకున్నా. సినిమాలో నటించడం, పాడడం వల్ల నేను క్యారెక్టర్‌కి బాగా కనెక్ట్ అయ్యా. పాటకు ఆడియెన్స్ నుంచి వస్తున్న రెస్పాన్స్ చూస్తే చాలా హ్యాపీగా అనిపిస్తుంది. గ్లోబల్‌గా వైరల్ అవ్వడం మరింత ఉత్సాహాన్నిస్తోంది. ఇవన్నీ చేయగలుగుతున్నా కాబట్టి నా జర్నీ సంతృప్తికరంగా ఉంది. ఈ సినిమాని మా ఆయన పార్థివ్ గోహిల్ ప్రొడ్యూస్ చేశారు. తను నాలాగే యాక్టర్, సింగర్ కూడా. ఈ సినిమా కథ వినప్పుడే నా క్యారెక్టర్ డిసైడ్ చేశారు. ఆ సినిమా హిట్ అవుతుంది అనుకున్నాం. కానీ గుజరాతీ సినిమాల్లో ఈ ఏడాది బెస్ట్‌గా నిలుస్తుంది అనుకోలేదు. పది రోజుల్లో 8.5 కోట్లు కలెక్ట్ చేసింది. గుజరాతీ సినిమా గొప్పదనం ఏంటో నిరూపించింది అని గర్వంగా చెప్తా.


## బ్యూటీ
# ముఖ సౌందర్యం కోసం..





### కీరా – అలోవెరాతో..

ఒక టేబుల్ స్పూన్ అలోవెరా జెల్‌లో పావు టీస్పూన్ కీరదోస తురుము వేసి బాగా కలపాలి. ఆ ప్యాక్‌ని ముఖం, మెడ భాగాలకు పూసుకోవాలి. పావుగంట తర్వాత గోరువెచ్చని నీటితో ముఖం కడుక్కుంటే కాంతివంతంగా ఉంటుంది.



### పాలు–తేనెలతో..

ఒక టీస్పూన్ తేనెలో రెండు టీస్పూన్లు పచ్చి పాలు కలపాలి. ఆ రెండూ బాగా మిక్స్ అయ్యేలా కలపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి రెండు లేదా మూడు నిమిషాలు మర్దన చేయాలి. ఆ తర్వాత గోరు వెచ్చని నీళ్లతో ముఖాన్ని కడగాలి. పాలు, తేనెల ఫేస్‌వాష్ వాడితే స్కిన్ కాంతివంతంగా మారుతుంది. జిడ్డు తొలగిపోతుంది. సెన్సిటివ్ స్కిన్ ఉన్న వాళ్లకు ఇది చాలా బాగా పనిచేస్తుంది.

# ఈడీ విచారణలో జోక్యం.. మమతా బెనర్జీపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

దిల్లీ: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీరుపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మనీలాండరింగ్ వ్యవహారంలో రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ 'ఐప్యాక్'పై జరుగుతున్న ఈడీ విచారణలో ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులు నేరుగా కలగజేసుకోవడం సరికాదని, ఆమె చర్యలు ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేలా ఉన్నాయని వ్యాఖ్యానించింది. బెంగాల్‌లో చోటుచేసుకున్న బొగ్గు కుంభకోణానికి సంబంధించి నమోదైన మనీలాండరింగ్ కేసుపై ఈడీ గత కొన్నాళ్లుగా దర్యాప్తు చేస్తోంది. అయితే, ముఖ్యమంత్రి మమతాబెనర్జీతోపాటు ప్రభుత్వ అధికారులు దర్యాప్తులో జోక్యం చేసుకుంటున్నారంటూ ఈడీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం..ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ఇలా ప్రవర్తించే



పరిస్థితి తలెత్తుతుందని రాజ్యాంగనిర్మాత అంబేద్కర్ ఎప్పుడూ ఊహించి ఉండరని వ్యాఖ్యానించింది. "ఇది రాష్ట్రానికి, కేంద్రానికి మధ్య వివాదం కాదు. ఓ ముఖ్యమంత్రి నేరుగా విచారణలో జోక్యం చేసుకోవడం సమర్థనీయం కాదు. ఈ అంశాన్ని కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య వివాదంగా తయారు చేయొద్దు. మీ చర్యలు ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయి" అని మమతాబెనర్జీని ఉద్దేశించి సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ఈడీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఐప్యాక్ సహ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ ప్రతీక్‌జైన్ ఇంట్లో ఈడీ సోదాలు నిర్వహిస్తున్న సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తన అధికారులతో కలిసి అక్కడకు ప్రవేశించినట్లు కోర్టుకు వెల్లడించారు. 2021 నుంచి టీఎంసీ పార్టీకి ఐప్యాక్ సేవలందిస్తోన్న సంగతి తెలిసిందే.


## ప్రధాని మోదీపై వ్యాఖ్యలు..
# ఖర్గేకు ఈసీ నోటీసులు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: ప్రధాని మోదీ ఉగ్రవాది అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలను ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించింది. ఈ వ్యాఖ్యలపై 24 గంటల్లో వివరణ ఇవ్వాలని పేర్కొంటూ నోటీసులు జారీ చేసింది. కాంగ్రెస్ నేత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు కేంద్ర మంత్రులు ఫిర్యాదు చేసిన కొన్ని గంటల్లోనే ఎన్నికల సంఘం నుంచి ఈ స్పందన వచ్చింది. తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో గురువారం పోలింగ్ జరగనున్న వేళ కాంగ్రెస్ అధ్యక్షుడికి నోటీసులు రావడం గమనార్హం. చెన్నైలో మంగళవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. అన్నాడీఎంకేపై విరుచుకుపడ్డారు. అన్నాదురై ఫొటో పెట్టుకునే అన్నాడీఎంకే నేతలు మోదీతో ఎలా చేతులు కలపగలరు? అని ప్రశ్నించారు. సమానత్వంపై ఆయనకు నమ్మకం లేదంటూ మోదీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇవి దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపాయి. క్షమాపణలు చెప్పాలని భాజపా డిమాండ్ చేయగా తన వ్యాఖ్యల్లోని ఉద్దేశంపై ఖర్గే వివరణ ఇచ్చారు. మోదీని ఎప్పుడూ ఉగ్రవాది అనలేదని, దేశ ప్రజాస్వామ్య స్వరూపాన్ని ఆయన టెర్రరైజ్ చేస్తున్నారని చెప్పడమే తన ఉద్దేశమని వివరించారు.

# భారత్ జోలికి వస్తే.. పాక్‌కు రాజ్‌నాథ్‌సింగ్ వార్నింగ్

బెర్లిన్/న్యూఢిల్లీ, ఏప్రిల్ 22 : పహల్గాం ఉగ్ర దాడి జరిగి నేటికి ఏడాది పూర్తయ్యింది. ఈక్రమంలోనే రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పాకిస్థాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. జర్మనీలో ఏర్పాటు చేసిన ఓ సభలో ఆయన మాట్లాడుతూ భారత్‌ను ప్రమాదంలో పడెయ్యాలని చూస్తే దేశ ప్రతిస్పందన ఎలా ఉంటుందో చూస్తారంటూ వార్నింగ్ ఇచ్చారు. "ఇప్పటి వరకు భారత్ చరిత్రను పరిశీలిస్తే కావాలని ఎవరిపైనా దాడి చేయలేదు. పొరుగుదేశాలు



భారత్‌ను ప్రమాదంలో పడెయ్యాలని చూస్తే ప్రతిస్పందన అదే స్థాయిలో ఉంటుంది" అని పాక్ పేరును ప్రస్తావించకుండా వ్యాఖ్యానించారు. పొరుగుదేశాలన్నీ సఖ్యతగానే ఉన్నాయని, సమస్యలను సృష్టించేది ఆ ఒక్కటి మాత్రమేనని పరోక్షంగా పాక్‌పై విమర్శలు గుప్పించారు. భారత సైనిక వ్యవస్థ ఇంతకుముందు కంటే దృఢంగా మారిందని, ఆపరేషన్ సిందూర్‌లో ఏం చేసిందో మీకు తెలిసే ఉంటుంది కదా! అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. భవిష్యత్తులో భారత్ తమ పట్ల తప్పుగా వ్యవహరిస్తే కోల్‌కతాపై దాడి చేస్తామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల హెచ్చరికలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పహల్గాం దాడి ఘటనకు ఏడాది పూర్తయిన వేళ రక్షణ మంత్రి పాక్‌కు వార్నింగ్ ఇవ్వడం గమనార్హం. 'గతేడాది ఏప్రిల్ 22న పిరికిపందలు చేసిన పహల్గాం ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమాయకులకు నా హృదయపూర్వక నివాళులు. వారి కుటుంబ సభ్యుల బాధను మేం ఎల్లప్పుడూ పంచుకుంటాం. జాతికి తగిలిన దెబ్బను ఎప్పటికీ మర్చిపోలేం' అని రాజ్‌నాథ్ సింగ్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.



## ఇరాన్ నుంచి ఇరాక్‌కు భారీగా నగదు..
# అడ్డుకున్న అమెరికా!

వాషింగ్టన్/టెహ్రాన్: ఇరాన్ నుంచి ఇరాక్‌కు భారీగా నగదు తీసుకెళుతున్న విమానాన్ని అమెరికా అడ్డుకున్నట్లు తెలుస్తోంది. దాదాపు 500 మిలియన్ డాలర్ల విలువైన కరెన్సీతో వెళ్తున్న విమానాన్ని అమెరికా ఎయిర్‌ఫోర్స్ అడ్డగించినట్లు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వెలువడుతున్నాయి. అయితే, ఇరాన్ దీనిపై ఇప్పటి వరకు స్పందించలేదు. అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో.. ఇరాక్‌లోని ఇరాన్ మద్దతుగల మిలిటెంట్ల గ్రూప్‌లకు ఆర్థిక సాయం చేయడం ద్వారా.. అక్కడి అమెరికా స్థావరాలపై దాడులకు టెహ్రాన్ పురిగొల్పుతోందని మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ క్రమంలోనే ఇరాక్‌కు అమెరికా ఆర్థిక సాయాన్ని కూడా నిలిపివేసిందని తెలుస్తోంది. పశ్చిమాసియాలో చోటు చేసుకున్న ఉద్రిక్తతల కారణంగా ఇరాక్ గత కొంత కాలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ప్రధానంగా ఇరాన్, అమెరికా చర్యలు ఆ దేశానికి తలనొప్పిగా మారాయి. అక్కడి ప్రభుత్వం నేరుగా ఇరాన్‌కు మద్దతు తెలపకపోయినప్పటికీ.. ఆ దేశంలోని ఇరాన్ మద్దతుదారులు అమెరికా ప్రయోజనాలను లక్ష్యంగా చేసుకోవడంపై అగ్రరాజ్యం కన్నెర్ర చేస్తోంది. ఈ క్రమంలోనే భద్రతా సహకారాన్ని కూడా నిలిపివేసిందని ఇరాక్ అధికార వర్గాలు చెబుతున్నాయి.

# తమిళ పోరుకు సర్వం సిద్ధం.. పోలీసు పహారాలో రాష్ట్రం



ఏప్రిల్ 22: తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో గురువారం పోలింగ్ జరగనుంది. అధికారిక గణాంకాల ప్రకారం 5.73 కోట్ల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 4,023 మంది అభ్యర్థులు తమ భవితవ్యాన్ని తేల్చుకోనున్నారు. మరోసారి అధికారంలోకి రావాలని డీఎంకే నేతృత్వంలోని లౌకికవాద ప్రగతిశీల కూటమి (ఎస్‌పీఏ), ఎలాగైనా అధికారాన్ని చేజిక్కించుకోవాలని ప్రతిపక్ష ఏఐఏడీఎంకే నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ముమ్మర ప్రయత్నాలు చేశాయి. ఓటర్లను ఆకట్టుకునేలా పథకాలు ప్రకటించాయి. దక్షిణాసియాలోనే తమిళనాడు రాష్ట్రాన్ని ఓ ఆదర్శ రాష్ట్రంగా తీర్చుదిద్దుతానని ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత స్టాలిన్ హామీ ఇవ్వగా.. తొలిసారి ఓటు వేస్తున్న ఓటర్లు ఓ తప్పుడు వ్యక్తిని ఎంచుకోవద్దని ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విజ్ఞప్తి చేశారు. తాజా ఎన్నికల్లో ప్రముఖ సినీనటుడు విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ ఎలాంటి పొత్తులు లేకుండా బరిలో నిలిచింది. అన్ని స్థానాల నుంచీ అభ్యర్థులను నిలబెట్టిన ఈ పార్టీ.. తాజా ఎన్నికల్లో కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది. తొలిసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన ఆ పార్టీ అధినేత విజయ్ పెరంబూర్, తిరుచురాపల్లి తూర్పు నియోజకవర్గాల నుంచి పోటీలో నిలిచారు. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విడతలో పోలింగ్ జరుగుతుండటంతో.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఓటరు అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. మొత్తం 1.40 లక్షల మంది పోలీసులు ఎన్నికల విధుల్లో ఉన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని ఇప్పటికే తరలించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు భద్రత కల్పించారు.

**పశ్చిమ బెంగాల్‌లో 152 స్థానాల్లో..**

పశ్చిమబెంగాల్‌లో తొలి విడత పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు గానూ తొలి విడతగా.. 16 జిల్లాల పరిధిలోని 152 నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహిస్తున్నారు. అత్యంత సమస్యాత్మకమైన 8వేల పోలింగ్ కేంద్రాలను గుర్తించి.. ప్రత్యేకమైన భద్రత ఏర్పాట్లు చేశారు. పోలింగ్ జరగనున్న నియోజకవర్గాల పరిధిలో కేంద్ర బలగాలను మోహరించారు. అధికారిక సమాచారం ప్రకారం.. తొలి విడతలో సుమారు 3.60 కోట్ల మందికి పైగా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 1.84 కోట్లు మంది పురుషులు, 1.75 కోట్లు మంది మహిళలు, 465 మంది ఇతరులు ఉన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఆ సమయానికి క్యూ లైన్లలో ఉన్న వారిని ఓటు వేసేందుకు అనుమతించనున్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కారణంగా రాష్ట్రంలో ఓట్ల సంఖ్య 7.66 కోట్ల నుంచి 6.77 కోట్లకు తగ్గింది. 2021 నాటి పరిస్థితులకు భిన్నంగా ఈసారి తృణమూల్, భాజపాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. విజయంపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేసినప్పటికీ.. విజయం నల్లేరు మీద నడకలా కనిపించడం లేదు.


# హర్మ్యూజ్ దిగ్బంధన వ్యూహం.. వట్టి మాటలేనా?



హర్మ్యూజ్ జలసంధిని పూర్తిగా తమ అధీనంలోకి తెచ్చుకున్నామని, దిగ్బంధన వ్యూహం 'సూపర్ సక్సెస్' అయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. అయితే, అక్కడి వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. దాదాపు 900 మిలియన్ డాలర్లకు పైగా విలువైన చమురుతో కూడిన 34 ఇరాన్ సంబంధిత ట్యాంకర్లు హర్మ్యూజ్‌ను దాటి వెళ్లినట్లు తెలిపాయి. వీటిలో 19 ట్యాంకర్లు ఇరాన్‌కు చెందినవి కాగా.. మిగిలిన 15 నౌకలు అరేబియా సముద్రం నుంచి ఇరాన్ వైపుగా గల్ఫ్‌లోకి ప్రవేశించాయి. హర్మ్యూజ్‌ను దాటి వెళ్లిన 6 నౌకల్లో ఇరాన్ ముడిచమురు రవాణా చేసినట్లు సమాచారం. ఏప్రిల్ 13న హర్మ్యూజ్ దిగ్బంధనానికి అమెరికా పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఇరాన్ పోర్టులకు నౌకల రాకపోకలను అడ్డుకుంటామని ప్రకటించింది. ఈ మేరకు తన నేవీని రంగంలోకి దించింది. పరిమిత దేశాలకు చెందిన నౌకలను మాత్రమే అనుమతించేలా చర్యలు చేపట్టింది. అయితే, కొన్ని అంతర్జాతీయ కథనాల ప్రకారం.. ఇప్పటివరకు అమెరికా దళాలు కేవలం ఒక్క నౌకను మాత్రమే అడ్డుకోగా.. ఇండోపసిఫిక్‌లో ఆంక్షలకు గురైన మరో ట్యాంకర్‌ను తనిఖీ చేసినట్లు చెబుతున్నాయి. మరోవైపు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటన దీనికి విరుద్ధంగా ఉంది. మొత్తం 28 నౌకలను ఇరాన్ పోర్టులకు వెళ్లనీయకుండా వెనక్కి తిప్పి పంపినట్లు సెంట్రల్ కమాండ్ మంగళవారం ప్రకటన విడుదల చేసింది.

# రూ.3 వేలకు కక్కుర్తిపడి.. 26 ప్రాణాలు బలి..!

పహల్గాం, ఏప్రిల్ 22 : పహల్గాంలో ఉగ్రదాడి జరిగి నేటికి ఏడాది. కానీ ఆ మారణహోమం మిగిల్చిన విషాదం ఆ 26 కుటుంబాలను ఇంకా వెంటాడుతూనే ఉంది. అయితే ఆ ఉగ్ర ఘటనకు సంబంధించి మరో కోణం వెలుగులోకి వచ్చింది. ఇందులో ఇద్దరు స్థానికుల పాత్ర ఉన్నట్లు తేలింది. దాడికి పాల్పడిన ముగ్గురు పాకిస్థానీ ఉగ్రవాదులకు వారు ఆశ్రయం కల్పించారని, చెప్పే అవకాశం ఉన్నా.. పోలీసులకు సమాచారం ఇవ్వకుండా వారి గురించి రహస్యంగా ఉంచారని వెల్లడైంది. ఇందుకోసం వారు రూ.3 వేలు తీసుకున్నట్లు ఎన్ఐఏ విచారణలో తేలింది. గత ఏడాది ఏప్రిల్ 21 రాత్రి 10.30 గంటల సమయంలో స్థానికులు పర్వేజ్ అహ్మద్, బషీర్ అహ్మద్ వద్ద ముగ్గురు ఉగ్రవాదులు ఆశ్రయం పొందారు. ఆ సమయంలో వారి వద్ద ఆయుధాలు కనిపించాయి.



ఉర్దూ, పంజాబీ కలగలిసిన భాష మాట్లాడారు. లష్కరే తయ్యిబా అగ్ర కమాండర్, ప్రధాన నిందితుడు సాజిద్ జట్ట్ అలియాస్ అలీభాయ్ గురించి మాట్లాడుకున్నారు. తమ ప్రాంతంలో దాడి జరగడం ఖాయమని వారి మాటల్ని బట్టి అర్థమైనా కానీ, వారు పోలీసులను అప్రమత్తం చేయకుండా మౌనంగా ఉండిపోయారని దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఐదు గంటల పాటు వారి వద్ద ఆశ్రయం పొందిన ఆ ముగ్గురు ఉగ్రవాదులు .. అక్కడే తినేసి వెళ్లిపోయారు. అందుకోసం రూ.3 వేలు ఇచ్చారు. తర్వాత ఏప్రిల్ 22న దాడి జరగడానికి కొన్ని గంటల ముందు మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఆ ఉగ్రవాదులు బైసరన్ లోయలోని ఒక కంచె వెనకాల దాక్కొన్నారు. ఆ విషయాన్ని పర్వేజ్ అహ్మద్, బషీర్ అహ్మద్‌లు గుర్తించారు. అప్పుడు కూడా పోలీసులకు కానీ.. స్థానిక టూరిస్ట్ ఆపరేటర్లకు కానీ వీరు సమాచారం ఇవ్వలేదని వెల్లడైంది. ఆ ఇద్దరూ తమ గుర్రాలు ఎక్కడానికి పర్యాటకులు ఎవరైనా వస్తారా..? అని మాత్రమే చూసుకున్నారు. మధ్యాహ్నం ఒంటిగంటన్నర సమయంలో కొందరు రాగానే వారిని పహల్గాంలోని బైసరన్‌లోయకు తీసుకెళ్లారు. ఆ తర్వాత కొన్ని గంటలకు అక్కడ కాల్పుల మోత వినిపించడం, ఆ వాతావరణమంతా రక్తసిక్తమవడాన్ని చూశారు. దాంతో తమకేం సంబంధం లేదన్నట్టుగా నిశ్శబ్దంగా అక్కడినుంచి జారుకున్నారని తెలిసింది. ఎన్ఐఏ వారిని గత ఏడాది జూన్ 22న అరెస్టు చేసింది. డిసెంబర్‌లో ఫైల్ చేసిన ఛార్జ్‌షీట్‌లో సాజిద్ జట్ట్ పేరుతో పాటు ఆ స్థానికుల పేర్లను చేర్చింది.

# ఏఐ భామతో అమెరికన్ల 'మనసు' దోచి.. వేల డాలర్లు వెనకేసిన భారత మెడికో

సామాజిక మాధ్యమాలు తెరిస్తే.. ఏది మనిషో, ఏది ఏఐ క్యారెక్టరో గుర్తు పట్టడం కష్టం. ఆ మధ్య సామాజిక మాధ్యమాల్లో ఓ అమ్మాయి 18+ జోకులు వేస్తుంటే.. ఇదేంటి ఇంత బరితెగింపు! అంటూ ముక్కున వేలేసుకున్నారు. తీరా ఏఐ అవతార్ అని తెలిశాక కంగుతినడం వారి వంతైంది. ఇన్‌స్టా, ఫేస్‌బుక్ ఓపెన్‌చేస్తే ఇలా ఏఐ అవతార్‌లెన్నో దర్శనమిస్తుంటాయి. సరిగ్గా దీన్నే ఒక ఆదాయ మార్గంగా మార్చుకున్నాడు భారత్‌కు చెందిన మెడికల్ స్టూడెంట్. అమెరికాలోని ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని పోస్టులు పెట్టి వేల డాలర్లు సంపాదించాడు. ఈ మేరకు వైర్డ్ సంస్థ తన పరిశోధనాత్మక కథనంలో పేర్కొంది. భారత్‌కు చెందిన మెడికల్ విద్యార్థి సామ్ (మారుపేరు).. ఇన్‌స్టాగ్రామ్‌లో 'ఎమిలి హర్ట్' పేరుతో వర్చువల్ ఇన్‌ఫ్లూయెన్సర్ క్యారెక్టర్‌ను సృష్టించాడు. జెన్నిఫర్ లారెన్స్‌ను పోలిన అవతార్‌ను క్రియేట్ చేశాడు. వృత్తి పరంగా నర్సుగా పనిచేస్తున్నట్లుగా బయోలో పేర్కొన్నాడు. MAGA (మేక్ అమెరికా గ్రేట్ అగైన్) క్యాప్ ధరించి పోస్టులు పెట్టడం మొదలు పెట్టాడు. బికినీ ధరించి, బీర్లు తాగుతూ ఉన్న ఫొటోలను ఆన్‌లైన్‌లో పోస్ట్ చేశాడు. ట్రంప్ మద్దతుదారులు నచ్చే, మెచ్చే పోస్టులను తరచూ పెట్టేవాడు. అబార్షన్ ఈజ్ మర్డర్, అక్రమ వలసదారులను పంపించేయాలంటూ పోస్టులు పెట్టేవాడు. ఎమిలి హర్ట్ అకౌంట్‌లో పెట్టే పోస్టులు ఒక వర్గాన్ని విపరీతంగా ఆకట్టుకునేవి. కొన్ని పోస్టులకు 3, 5, 10 మిలియన్ వ్యూస్ కూడా వచ్చేవి. ఫాలోవర్ల సంఖ్య కూడా అనతికాలంలోనే 10 వేలు దాటింది. దీంతో తన అకౌంట్‌ను మానటైజ్ చేసి కొన్ని రకాల ఉత్పత్తులను కూడా సామ్ విక్రయించేవాడు. మోసపూరిత కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించిన మెటా.. సంబంధిత ఇన్‌స్టా అకౌంట్‌ను తొలగించింది. ఈ పరిశోధనాత్మక కథనం ప్రచురితం కావడంతో ఫేస్‌బుక్ కూడా ఆ పేరుతో ఉన్న ఖాతాను తొలగించింది. అయితే, ఈ పోస్టులు పెట్టేందుకు రోజులో 30 నుంచి 50 నిమిషాలు కేటాయించేవాడినని సామ్ చెప్పుకొచ్చాడు. గూగుల్ జెమినై, గ్రోక్ ఏఐ టూల్స్‌ను ఇందుకోసం ఉపయోగించినట్లు తెలిపాడు. భారత్‌లో ఏదైనా ఉద్యోగం చేసినా ఇంత డబ్బులు వచ్చేవి కావని పేర్కొన్నాడు. డబ్బు సంపాదించడానికి ఇదో గొప్ప మార్గంగా కనిపించిందన్నాడు.

## మారనున్న ఆటోడెబిట్ రూల్స్..

### ఆర్బీఐ కీలక ఆదేశాలు.. కొత్త రూల్స్ ఇవే




**న్యూఢిల్లీ:** ఆటోడెబిట్ విషయంలో ఇకపై కొత్త రూల్స్ అమలుకానున్నాయి. 'డిజిటల్ పేమెంట్స్, ఈ మ్యాండేట్ ఫ్రేమ్‌వర్క్, 2026'లో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కొత్త రూల్స్‌ను అమలుచేయబోతుంది. ఈ రూల్స్ కోట్లాది మంది భారతీయ వినియోగదారులకు మేలు చేస్తాయని ఆర్బీఐ భావిస్తోంది. ఈఎంఐలు, సబ్‌స్క్రిప్షన్స్, బిల్స్ వంటి వాటి విషయంలో నెలనెలా డెబిట్ అయ్యే నగదు విషయంలో కొత్త నిబంధనలు వర్తిస్తాయి. త్వరలో అమలు కాబోయే కొత్త రూల్స్ ఇవి. ఇకపై ప్రతి బ్యాంకు లేదా సంస్థ ఆటో డెబిట్‌కు కనీసం 24 గంటల ముందు అలర్ట్ ఇవ్వాలి. అందులోనూ కంపెనీ పేరు, అమౌంట్ వివరాలు, తేదీ, ఇతర కీలక సమాచారం తప్పనిసరిగా ఉండాలి. దీనివల్ల వినియోగదారులు అనవసరమైన ఆటో డెబిట్స్‌ను అడ్డుకునే వీలుంటుంది. రూ.15,000 లేదా ఆలోపు ఆటో డెబిట్ చెల్లింపులకు ఓటీపీ అవసరం లేదు. అలాగే, ఇన్సురెన్స్ ప్రీమియమ్స్, మ్యూచువల్ ఫండ్స్, క్రెడిట్ కార్డ్ బిల్స్ వంటి వాటికి ఈ పరిమితి రూ.1 లక్ష. ఇకపై యూజర్లు తమ పేమెంట్లను నచ్చినప్పుడు మార్చుకోవడం, రద్దు చేసుకోవడం చేయొచ్చు. ఈ విషయంలో వినియోగదారుడికి పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. కొత్త డెబిట్ లేదా క్రెడిట్ కార్డు మార్చుకున్న తర్వాత వాటికి తిరిగి ఆటో పేమెంట్స్ సెటప్ చేసుకోవాల్సిన అవసరం లేదు. గతంలో పాత కార్డుకు లింకై ఉన్న పేమెంట్స్.. ఆటోమేటిగ్గా కొత్తవాటికి బదిలీ అవుతాయి. క్రెడిట్, డెబిట్ కార్డులు, యూపీఐ ఉపయోగించి చేసే ఓటీటీ సబ్‌స్క్రిప్షన్స్, ఇన్సూరెన్స్ ప్రీమియంలు, ఎలక్ట్రిసిటీ బిల్లులు, వాటర్ బిల్లులు, ఈఎంఐలు, ఇతర చెల్లింపులకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. అయితే, ఫాస్టాగ్, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డుల వంటి వాటికి ఈ నిబంధనలు వర్తించవు.

## ఇరాన్-అమెరికా చర్చలపై సందిగ్ధం..

### భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు




**ముంబై:** భారత స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. ఇరాన్ తో కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించినప్పటికీ.. శాంతి చర్చల అంశం ఇంకా కొలిక్కి రాకపోవడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనికితోడు గరిష్ఠ స్థాయిలో క్రూడాయిల్ ధరలు కొనసాగుతుండటం, ఇటీవల లాభాల నేపథ్యంలో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం వంటివి కూడా ప్రభావం చూపాయి.

ముఖ్యంగా ఐటీ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి సూచీలను పడేసింది. దాంతో సెన్సెక్స్ 750 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 24,400 దిగువకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 79,019.34 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల బాటలోనే పయనించింది. ఇంట్రాడేలో 78,442.30 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 756.84 పాయింట్ల నష్టంతో 78,516.49 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 198.50 పాయింట్ల నష్టంతో 24,378.10 వద్ద ముగిసింది.

డాలరుతో రూపాయి మారకం విలువ 37 పైసలు క్షీణించి 93.81గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 10 శాతం మేర నష్టపోయింది. ఇన్ఫోసిస్, మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్, టెక్ మహీంద్రా స్టాక్స్ కూడా నష్టాలు చవిచూశాయి. హిందుస్థాన్ యూనిలీవర్, ఎన్టీపీసీ, ఎటర్నల్, ట్రెంట్, అల్ట్రాటెక్ సిమెంట్ లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 99 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం 4,754 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## గృహ విక్రయాలపై ఐటీ రంగం ఎఫెక్ట్..



**న్యూఢిల్లీ:** కృత్రిమ మేధ అన్ని రంగాలకు వేగంగా విస్తరిస్తుండటంతో అంతర్జాతీయంగా పలు కంపెనీలు లేఆఫ్‌లు ప్రకటిస్తున్నాయి. ముఖ్యంగా ఐటీ రంగానికి చెందిన వారిపై ఈ ఎఫెక్ట్ ఎక్కువగా ఉంటోంది. ఇంకోపక్క ఐటీ నియామకాల్లో మందగమనమూ కొనసాగుతోంది. ఇవన్నీ భారత్‌లో గృహ విక్రయాలపై ప్రభావం చూపిస్తున్నాయి. దాంతో ఇళ్లు కొనుగోలు చేసేవారు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఐటీ హబ్‌లుగా పేరున్న హైదరాబాద్, బెంగళూరు, పుణెలో ఈ ప్రభావం ఉందని నైట్ ఫ్రాంక్ ఇండియా తాజాగా గణాంకాలను వెల్లడించింది.

2026 మొదటి త్రైమాసికం (గతేడాది ఇదే సమయంతో పోలిస్తే)లో ప్రధాన ఎనిమిది నగరాల్లో అమ్మకాలు నాలుగు శాతం తగ్గాయి. కొత్తగా నిర్మాణం పూర్తయిన ఇళ్ల అమ్మకాలు రెండు శాతం తగ్గి, 94,855కి చేరాయి. కొవిడ్ మహమ్మారి తర్వాత పుంజుకున్న ఈ రంగం మళ్లీ ఇప్పుడు మందగమనాన్ని చూస్తోందని ఈ గణాంకాలను బట్టి తెలుస్తోంది. నేషనల్ క్యాపిటల్ రీజియన్, పుణెలో మార్కెట్ మరీ బలహీనంగా ఉంది. ఐటీ ఉద్యోగాల్లో కోతలు, నియామకాల్లో అనిశ్చితి, ఆ ఆర్థిక భారాన్ని భరించగలమో లేదోనన్న ఆందోళన, అంతర్జాతీయ పరిణామాలు కొనుగోలుదారుల సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలను ఈ అంశాలు ప్రధానంగా ప్రభావితం చేస్తున్నాయని నైట్ ఫ్రాంక్ ఇండియా లెక్కలు వెల్లడిస్తున్నాయి. వరుసగా ఐదేళ్ల వృద్ధి తర్వాత ఇలాంటి అనూహ్య పరిణామాలు అనివార్యమేనని ఆ సంస్థ నేషనల్ డైరెక్టర్ అంకితా సూద్ పేర్కొన్నారు. పరిమాణం పరంగా చూసుకుంటే తక్కువే అయినా.. విలువ పరంగా పెరుగుదల ఉందని పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. లావాదేవీల విలువ ప్రతి ఏడాది ఐదు నుంచి ఆరు శాతం పెరుగుతోందని గుర్తుచేశాయి.

# లక్నోపై రాజస్థాన్ ఘన విజయం..

### పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి 'రాయల్స్'

### సొంత మైదానంలో 40 పరుగుల తేడాతో ఓడిపోయిన లక్నో

### తొలుత బ్యాటింగ్ చేసి 159 పరుగులు చేసిన రాజస్థాన్

### 119 పరుగులకే కుప్పకూలిన లక్నో సూపర్ జెయింట్స్



**లక్నో:** రాజస్థాన్ రాయల్స్ చేతిలో లక్నో సూపర్ జెయింట్స్ తన సొంత మైదానంలో ఓటమి చవిచూసింది. ఐపీఎల్ 2026లో భాగంగా లక్నోలోని భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజపేయి ఏక్నా క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ 40 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది.

రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేయగా, 160 పరుగుల లక్ష్యంతో క్రీజులోకి దిగిన లక్నో 18 ఓవర్లలో 119 పరుగులకే ఆలౌట్ అయింది. లక్నో



చివరలో 15 పరుగుల తేడాలో ఐదు వికెట్లను కోల్పోయింది.

లక్నో సూపర్ జెయింట్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ 159 పరుగులు చేసింది. చివరి ఓవర్‌లో లక్నో బౌలర్ మయాంక్ అగర్వాల్ ఏకంగా 20 పరుగులు ఇచ్చాడు. దీనితో రాజస్థాన్ స్కోర్ 150 దాటింది.

ప్రారంభంలో దూకుడు మీదున్న జైశ్వాల్‌ను మహమ్మద్ షమీ పెవిలియన్‌కు పంపించాడు. మూడో ఓవర్ వేసిన షమీ వరుస బంతుల్లో జైశ్వాల్, ధ్రువ్ జురెల్‌లను ఔట్ చేశాడు. దీంతో రాజస్థాన్ ఆట నెమ్మదించింది. షమీ, ప్రిన్స్ యాదవ్, మోహ్సిన్ ఖాన్ తలా రెండు వికెట్లు తీశారు. రాజస్థాన్ ఆటగాళ్లలో రవీంద్ర జడెజా (43), జైస్వాల్ (22), హెట్మెయర్ (22) శివమ్ దుబే (19) పరుగులు చేశారు.

ఆ తర్వాత ఛేదన ప్రారంభించిన లక్నో మొదటి రెండు ఓవర్లలోనే కీలక రెండు వికెట్లను కోల్పోయింది. నాండ్రే బర్గర్ బౌలింగ్‌లో రిషబ్ పంత్ డకౌట్‌గా వెనుదిరిగాడు. లక్నో ఆటగాళ్లలో మిచెల్ మార్ష్ 41 బంతుల్లో 55 పరుగులు చేసి రాణించాడు. మిగిలిన వారు ఎవరూ ఉత్తమ ప్రదర్శన కనబరచలేదు. జోఫ్రా ఆర్చర్ 3, బ్రిజేష్ శర్మ, నాండ్రే బర్గర్ రెండేసి వికెట్ల చొప్పున తీసుకున్నారు.

పంజాబ్ కింగ్స్ ఆరు మ్యాచ్‌లకు గాను ఐదింట గెలిచి 11 పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. ఇప్పటి వరకు 4 పాయింట్లతో బెంగళూరు, హైదరాబాద్, రాజస్థాన్ రెండు, మూడు, నాలుగో స్థానాల్లో ఉన్నాయి. లక్నోపై విజయం సాధించడంతో మొత్తం పది పాయింట్లు సాధించిన రాజస్థాన్ పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి ఎగబాకింది.

## ఐసీసీలో కీలక పదవికి వాసీమ్ ఖాన్ రాజీనామా..

### పదవీకాలం ముగియకుండానే ఎందుకు..?



**న్యూఢిల్లీ:** పాకిస్థాన్ క్రికెట్ బోర్డు మాజీ సీఈవో వాసిమ్ ఖాన్ ఐసీసీ కీలక పదవి నుంచి వైదొలిగారు. ఐసీసీలో జనరల్ మేనేజర్ పదవికి ఆయన రాజీనామా చేశారు. నాలుగేళ్లపాటు ఆ బాధ్యతలు నిర్వర్తించిన ఆయన తాజాగా ఆ పదవిని వీడారు. 2022లో జెఫ్ అల్లార్డెస్ నుంచి వాసీమ్ ఖాన్ బాధ్యతలను స్వీకరించారు. అంతకుముందు 2019 నుంచి మూడేళ్లపాటు ఆయన పీసీబీ సీఈవోగా పనిచేశారు. అయితే ఇప్పుడు ఐసీసీ జనరల్ మేనేజర్ పదవి నుంచి వైదొలిగినా.. జూన్ నెలాఖరులో ఖాన్ మరో పదవీ బాధ్యతలను తీసుకొనే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు వెల్లడించాయి.

గత రెండేళ్లుగా ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్‌లో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. వివిధ కారణాలతో అత్యున్నత స్థాయిలో ఉండే వ్యక్తులు తమ పదవులను వీడుతున్నారు. అల్లార్డెస్‌తోపాటు యాంటీ కరప్షన్ యూనిట్‌కు చెందిన క్రిస్ టెట్లీ (ఈవెంట్స్ హెడ్), అలెక్స్ మార్షల్ తమ పదవులకు రాజీనామా చేశారు. వారి స్థానంలో గౌరవ్ సక్సేనా, ఆండ్రూ వచ్చి చేరారు. ఇప్పుడు వాసిమ్‌ఖాన్ కూడా తన పదవికి రాజీనామా చేశారు. పాక్ క్రికెట్ బోర్డులో కీలక బాధ్యతలు చేపట్టిన వాసీమ్ ఇంగ్లండ్‌లో జన్మించడం గమనార్హం. అక్కడే తన క్రికెట్ కెరీర్‌ను మొదలుపెట్టాడు.

వాసీం ఖాన్1995 నుంచి 2001 వరకు ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో, 1998 నుంచి 2002 వరకు లిస్ట్-ఎ మ్యాచ్‌ల్లో ఆడాడు. 1995లో వార్విక్‌షైర్ కౌంటీ టైటిల్ గెలుచుకున్న జట్టులో అతను సభ్యుడిగా ఉన్నారు. పాకిస్థాన్ మూలాలు ఉన్నప్పటికీ, అతను పాక్ జట్టు తరఫున ఒక్క మ్యాచూ ఆడలేదు. కానీ పీసీబీకి సీఈవోగా పనిచేయడం గమనార్హం. ఐసీసీ జనరల్ మేనేజర్‌గా గత నాలుగేళ్లుగా సేవలందిస్తున్న వాసిమ్ ఖాన్, తాజాగా తన పదవి నుంచి తప్పుకున్నారు.

## బౌన్సర్ హెల్మెట్‌కు తగిలి కిందపడ్డ బ్యాటర్..

### పిచ్ ప్రమాదకరంగా ఉందంటూ మ్యాచ్ రద్దు..



**ట్రినిడాడ్:** వెస్టిండీస్ బౌలర్ వేసిన ఓ బౌన్సర్ హెల్మెట్‌కు తగలడంతో.. బ్యాటర్ కిందపడిపోయాడు. దీంతో ఏకంగా ఆ మ్యాచ్‌నే రద్దు చేశారు. ఈ ఘటన వెస్టిండీస్ దేశవాళీ చాంపియన్‌షిప్ క్రికెట్‌లో జరిగింది. సర్ వివయన్ రిచర్డ్స్ మైదానంలో ట్రినిడాడ్ అండ్ టొబాగో బౌలర్ జేడన్ సీల్స్ వేసిన బంతి అనూహ్యంగా బౌన్స్ అయి లీవార్డ్ ఐలాండ్స్ బ్యాటర్ జెరిమియా లూయిస్ హెల్మెట్‌కు తగిలింది. బంతి గట్టిగా తగలడంతో బ్యాటర్ కిందపడిపోయాడు. తలకు ఉన్న హెల్మెట్‌ను అతను తీసేశాడు. ఆ తర్వాత కాసేపటికి లేచిన బ్యాటర్ లూయిస్ కోపంలో హెల్మెట్‌ను తన్నాడు. పిచ్ నుంచి వెళ్లిపోయాడు. అయితే పిచ్ ప్రమాదకరంగా ఉందని అధికారులు మ్యాచ్‌ను అకస్మాత్తుగా నిలిపేశారు. అప్పటికే ట్రినిడాడ్ బౌలర్ జేడన్ సీల్స్ తన ఖాతాలో ఏడు వికెట్లు వేసుకున్నాడు. నిప్పులు చెరుగుతున్న సీల్స్ బౌలింగ్ ధాటికి బ్యాటర్ లూయిస్ నిలవలేకపోయాడు. ఆ సమయంలో లీవార్డ్ జట్టు ఏడు వికెట్ల నష్టానికి 140 రన్స్ చేసింది. బ్యాటర్ లూయిస్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాంకషన్ చెకింగ్ చేశారు. అతను నిలకడగా ఉన్నట్లు తేల్చారు. పిచ్ పరిస్థితి ప్రమాదకరంగా ఉన్న నేపథ్యంలో మ్యాచ్‌ను రద్దు చేసినట్లు వెస్టిండీస్ బోర్డు ప్రకటన చేసింది. వెస్టిండీస్ చాంపియన్‌షిప్‌లో భాగంగా జరుగుతున్న ఈ మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు.

## నా ప్లాన్ అదే.. సెంచరీ సీక్రెట్ చెప్పిన అభిషేక్ శర్మ


### ఢిల్లీ క్యాపిటల్స్‌పై 135 పరుగులతో అజేయంగా నిలిచిన అభిషేక్ శర్మ

### సన్‌రైజర్స్‌ను పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి చేర్చిన భారీ విజయం

### సరైన మ్యాచ్‌అప్‌ల కోసం ఓపికగా ఎదురుచూడటమే తన వ్యూహమన్న స్టార్ బ్యాటర్

### రెండో స్ట్రాటజిక్ టైమ్‌అవుట్ వరకు క్రీజులో ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వెల్లడి

### పవర్‌ప్లేలో స్పిన్నర్లపై ఆధిపత్యం చెలాయించడమే తన ప్రణాళిక అని స్పష్టీకరణ



**న్యూఢిల్లీ:** ఢిల్లీ క్యాపిటల్స్‌పై 135 పరుగులతో అజేయంగా నిలిచి సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) విజయంలో కీలక పాత్ర పోషించిన యువ ఓపెనర్ అభిషేక్ శర్మ, తన విధ్వంసకర ఇన్నింగ్స్ వెనుక ఉన్న ప్రణాళికను వెల్లడించాడు. ఇది కేవలం బాదుడు మాత్రమే కాదని... ఓపిక, గేమ్ అవగాహన, సరైన మ్యాచ్‌అప్‌లను లక్ష్యంగా చేసుకుని ఆడిన వ్యూహాత్మక ఇన్నింగ్స్ అని స్పష్టం చేశాడు.

అభిషేక్ శర్మ అద్భుత శతకం సాయంతో తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ 2 వికెట్ల నష్టానికి 242 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం బౌలింగ్‌లోనూ అద్భుతంగా రాణించి, వరుసగా మూడో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఈ గెలుపుతో పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది.


ఈ మ్యాచ్ అనంతరం అభిషేక్ శర్మ మాట్లాడుతూ... "ఈ ఇన్నింగ్స్ కోసం చాలా కాలంగా సన్నద్ధమవుతున్నాను. టాప్-3 బ్యాటర్లలో ఒకరు చివరి వరకు క్రీజులో ఉండాలనేది మా ప్రణాళిక. ముఖ్యంగా నేను రెండో స్ట్రాటజిక్ టైమ్‌అవుట్ వరకు ఆడాలని మా బ్యాటింగ్ కోచ్ ఫ్రాంకీతో చర్చించాను. చాలాకాలంగా అది సాధ్యం కాలేదు. కానీ, ఈసారి ఎలాగైనా సాధించాలని అనుకున్నా" అని వివరించాడు.

గేమ్ ప్లాన్‌ను మరింత వివరిస్తూ... "పిచ్‌పై ప్రతీ బంతిని బలంగా బాదడం కష్టమని నాకు అర్థమైంది. అందుకే సరైన మ్యాచ్‌అప్‌ల కోసం ఓపికగా ఎదురుచూశాను. మొదటి స్ట్రాటజిక్ టైమ్‌అవుట్ సమయంలో కోచ్ వచ్చినప్పుడు కూడా ఇదే ప్రణాళికను కొనసాగించాలని నిర్ణయించుకున్నాం. నా వ్యూహం ఫలించింది" అని తెలిపాడు. ముఖ్యంగా పవర్‌ప్లేలో స్పిన్నర్లను ఎదుర్కోవడంపై తన వ్యూహాన్ని స్పష్టం చేశాడు. "పవర్‌ప్లేలో స్పిన్నర్లు బౌలింగ్‌కు వస్తే, వారిపై ఆధిపత్యం చెలాయించి ఒత్తిడి పెంచడమే నా ప్లాన్. అది బంతి స్పిన్ అయినా, ఆగినా నా ప్రణాళిక మారదు" అని అన్నాడు.

భాగస్వామ్యాల గురించి మాట్లాడుతూ... "నాతో పాటు ఎవరు బ్యాటింగ్ చేస్తున్నా, ఓవర్ తొలి రెండు, మూడు బంతుల్లో బౌండరీ వస్తే ఆ ఓవర్‌ను భారీగా మలచడానికి ప్రయత్నిస్తాం. ఇది ప్రత్యర్థి బౌలర్‌పై ఒత్తిడిని పెంచుతుంది" అని తన ఆలోచనా విధానాన్ని పంచుకున్నాడు.

# నీకెంత.. నాకెంత?

ఆకట్టుకుంటున్న 'ఎంఆర్‌పీ' టీజర్!




**టాకీస్:** టాలీవుడ్ నటులు నరేశ్ అగస్త్య, వెన్నెల కిశోర్ ప్రధాన పాత్రల్లో శ్రవణ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఎంఆర్‌పీ'. 'నీకెంత, నాకెంత' అనే ఆసక్తికరమైన ఉపశీర్షికతో ఈ సినిమా రాబోతుండగా తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. 'మన కల కోసం మనం పనిచేయకపోతే.. వేరే వాళ్ల కలల కోసం మనం పనిచేయాల్సి ఉంటుంది' అనే డైలాగుతో ప్రారంభమైన ఈ టీజర్ సోషల్ మీడియాలో విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి, బిగ్ బాస్ ఫేమ్ డోనాల్ బిష్ట్ టాలీవుడ్‌లోకి కథానాయికగా అడుగుపెడుతున్నారు.

ఈ టీజర్‌ను గమనిస్తే, మధ్యతరగతి యువత కలలు, నేటి సమాజంలో ఆర్థిక సంబంధాల చుట్టూ సాగే ఒక విభిన్నమైన కాన్సెప్ట్ ఓరియెంటెడ్ కథాంశంతో ఈ సినిమా రూపుదిద్దుకున్నట్లు తెలుస్తుంది. గతంలో 'మత్తు వదలరాస గుర్రం పాపి రెడ్డి వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నరేశ్ అగస్త్య మరో ఆసక్తికర పాత్రలో కనిపిస్తుండగా, వెన్నెల కిశోర్ తనదైన శైలిలో వినోదాన్ని పంచేందుకు సిద్ధమయ్యారు. ఎం.ఎస్.ఆర్ ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రం కామెడీ మరియు యాక్షన్ ఎలిమెంట్స్‌తో కూడిన పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది.



MOVIE TIME

## సల్మాన్, వంశీపైడిపల్లి మూవీకి క్లాప్



**టాకీస్:** బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్, టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ ఎస్‌వి63 ముంబైలో ఘనంగా ప్రారంభమైంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అధికారిక వీడియోను చిత్ర యూనిట్ విడుదల చేసింది. దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇది సల్మాన్ ఖాన్ కెరీర్‌లోనే ఒక ప్రత్యేకమైన యాక్షన్ ఎంట్టంల్గ÷నర్‌గా ఉండబోతోందని సమాచారం. ఇక మొదటిసారి సల్మాన్ ఖాన్‌ను వంశీ పైడిపల్లి డైరెక్ట్ చేస్తుండటంతో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇందులో లేడీ సూపర్ స్టార్ నయనతార హీరోయిన్‌గా నటిస్తోంది.

# పెద్ది మూవీలో శృతి స్పెషల్ డ్యాన్స్

**టాకీస్:** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'పెద్ది'కి సంబంధించిన తాజా అప్‌డేట్ టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమాలోని స్పెషల్ సాంగ్ కోసం ప్రముఖ హీరోయిన్ శృతి హాసన్‌ని ఎంపిక చేసినట్లు సమాచారం. ఇప్పటికే పలువురు హీరోయిన్ల పేర్లు వినిపించినా? చివరకు ఈ అవకాశాన్ని శృతి హాసన్ దక్కించుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ స్పెషల్ సాంగ్ షూటింగ్ త్వరలోనే ప్రారంభమై, తక్కువ సమయంలో పూర్తయ్యేలా చిత్ర యూనిట్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. సినిమాకు హైలైట్‌గా నిలిచే ఈ పాటలో శృతి హాసన్ గ్లామర్, స్టెప్పులు ప్రత్యేక ఆకర్షణగా ఉండబోతున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక శృతి హాసన్‌కు స్పెషల్ సాంగ్స్ కొత్తేమీ కాదు. గతంలోనే రామ్ చరణ్‌తో కలిసి 'ఎవడు' సినిమాలో 'పింపుల్ డింపుల్' పాటలో సందడి చేసిన విషయం తెలిసిందే. అలాగే మహేశ్ బాబు నటించిన 'ఆగడు' సినిమాలో కూడా ఆమె ప్రత్యేక గీతంలో మెరిసి ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు 'పెద్ది'లో మరోసారి స్పెషల్ సాంగ్‌తో రాబోతుండటంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. ఇప్పటికే ఈ సినిమా పై భారీ అంచనాలు ఉండగా? శృతి హాసన్ ఎంట్రీతో మరింత హైప్ పెరిగే అవకాశముంది.ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న 'పెద్ది' సినిమా నుంచి త్వరలోనే ఈ స్పెషల్ సాంగ్‌పై అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. ఈ పాట ఎలా ఉండబోతుందో? శృతి హాసన్ ఏ రేంజ్‌లో ఆకట్టుకుంటుందో చూడాలని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'ఉప్పెన' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న చిత్రం పెద్ది కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమె తెలుగులో చేస్తున్న కీలక ప్రాజెక్టుల్లో ఇది ఒకటిగా నిలుస్తోంది.




## చిరుతో బాబీ సినిమా నెగెటివ్ రోల్‌లో డింపుల్ హయతి

**టాకీస్:** టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద 'వాల్తేరు వీరయ్య'తో మ్యాజిక్ చేసిన మెగాస్టార్ చిరంజీవి, మాస్ డైరెక్టర్ బాబీ కొల్లి మళ్ళీ చేతులు కలిపారు. చిరంజీవి కెరీర్‌లో 158వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులను ముగించుకుని షూటింగ్‌కు సిద్ధమవుతోంది. ఇప్పటికే మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, బాలీవుడ్ నటుడు అనురాగ్ కశ్యప్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. ఇక ఈ సినిమాలో చిరు సరసన ప్రియమణి హీరోయిన్‌గా నటించే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా, ఈ చిత్రానికి సంబంధించి తాజాగా వినిపిస్తున్న ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది.

ఈ సినిమాలో ఒక కీలక పాత్ర కోసం బోల్డ్ బ్యూటీ డింపుల్ హయాతిని ఎంపిక చేసినట్లు సమాచారం. సాధారణంగా డింపుల్ హయాతి అంటే గ్లామర్ పాత్రలకు కేరాఫ్ అడ్రస్. కానీ బాబీ ఈ సినిమాలో ఆమెను సరికొత్తగా చూపించ బోతున్నారట. ఇందులో ఆమె హీరోయిన్ కాదు అని, నెగిటివ్ షేడ్స్ ఉన్న ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తుందని తెలుస్తోంది. మెగాస్టార్ వంటి దిగ్గజ నటుడికి ఎదురు నిలిచే పాత్ర కావడంతో డింపుల్ రోల్ చాలా ఇంటెన్సివ్‌గా ఉండబోతోందట. ఈ డిఫరెంట్ కాస్టింగ్ సినిమాకు పెద్ద ప్లస్ అవుతుందని ఫిలిం నగర్ వర్గాలు భావిస్తున్నాయి. కమెగాస్టార్ ఒక సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నారని, బాబీ ఈ పాత్రను చాలా స్టైలిష్‌గా డిజైన్ చేశారని టాక్.





## సిటాడెల్-2 సీజన్‌లో ప్రియాంక చోప్రా

**టాకీస్:** గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా, హాలీవుడ్ నటుడు రిచర్డ్ మాడెన్ ప్రధాన పాత్రల్లో నటించిన యాక్షన్ స్పై థ్రిల్లర్ సిరీస్ 'సిటాడెల్' రెండో సీజన్‌కు సంబంధించి అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సిరీస్ అధికారిక ట్రైలర్‌ను విడుదల చేస్తూ.. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న స్ట్రీమింగ్ తేదీని ప్రకటించింది. ఈ సిరీస్‌ను మే 6 నుంచి స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు ప్రకటించింది. ఇంగ్లీష్‌తో పాటు తెలుగు, హిందీ, తమిళం, మలయాళ భాషల్లో ఈ సిరీస్ అందుబాటులోకి రాబోతోంది.

ఈ రెండో సీజన్ ట్రైలర్ గమనిస్తే.. ఫస్ట్ పార్ట్ కంటే ఇందులో మరింత యాక్షన్ ఉండబోతున్నట్లు తెలుస్తుంది. నాడియా సిన్ (ప్రియాంక), మేసన్ కేన్ (రిచర్డ్) మరియు బెర్నార్డ్ ఓర్లిక్ (స్టాన్లీ టుచి) తమ గతాన్ని గుర్తుకు తెచ్చుకుంటూనే, సిటాడెల్ సంస్థను నాశనం చేసిన క్రూరమైన 'మాంటికోర్' నెట్‌వర్క్ నుంచి ప్రపంచాన్ని రక్షించే భారీ మిషన్‌లో తలపడబోతున్నారు. హాలీవుడ్ ప్రముఖులు జాక్ రేనర్, మ్యాట్ బెర్రీ వంటి వారు కొత్తగా ఈ సీజన్‌లో భాగం కాగా, రూసో బ్రదర్స్ నిర్మాణ విలువలు ఈ సిరీస్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాయి. ప్రస్తుతం రాజమౌళి ? మహేష్ బాబు కాంబినేషన్‌లో వస్తున్న 'వారణాసి' సినిమా షూటింగ్‌లో ప్రియాంక చోప్రా బిజీగా ఉన్నప్పటికీ, ఆమె తన గ్లోబల్ ప్రాజెక్ట్ 'సిటాడెల్'తో అంతర్జాతీయ స్థాయిలో మరోసారి తన సత్తా చాటడానికి సిద్ధమైంది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.